పాఠశాలల్లో పనులు పూర్తవ్వాలి : డీఈవో

రాజమహేంద్రవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలల్లోని పనులు యుద్ధ ప్రాతిపదికన ఈ నెల 18లోగా పూర్తి కావాలని డీఈవో ఎస్.అబ్రహం ఆదేశించారు. అన్ని మండలాల ఎంఈవోలు, ఇంజనీర్లు, ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం అత్యవసరంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పనుల ప్రగతిపై నివేదిక అందజేయాలన్నారు.

మళ్లీ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లింపు

సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు

కొవ్వూరు, జనవరి 12 : కేంద్ర ప్రభుత్వం నాలుగు రోజుల కిందట గ్రామాల అభివృద్ధికి విడుదల చేసిన రూ.988 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించాలని చూస్తుందని సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు విమర్శించారు. కొవ్వూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 12,918 గ్రామాల అభివృద్ధికి కేంద్రం 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ. 988 కోట్లు నాలుగు రోజుల కిందట విడుదల చేసినట్టు కేంద్ర ప్రభుత్వ అధికారుల నుంచి సమాచారం ఉందన్నారు. ఈ నిధులను గ్రామాల అభివృద్ధికి ఖర్చుచేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.398 కోట్లను మాత్రమే గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేసి మిగిలిన రూ. 600 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. గతంలో దారిమళ్లించిన రూ.8,629 కోట్లు, తాజాగా దారిమళ్లించిన రూ. 600 కోట్లు 4 రోజుల్లో తిరిగి గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఖాతాల్లో జమచేయాలన్నారు. లేకపోతే రాజకీయాలకతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో తాడేపల్లిలోని రాష్ట్ర పంచాయితీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన పెంచాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం,జనవరి12(ఆంధ్రజ్యోతి) : 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని, అందులో భాగంగా పోస్టల్ బ్యాలెట్, ఆబ్సెంటీ ఓటర్ల విషయంలో కీలకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు. కలెక్టర్‌లో శుక్రవారం జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్(ఏఎల్ఎంటి) రెండో రోజు శిక్షణలో మాట్లాడారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే వ్యక్తులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పించాలన్నారు.భర్తతో సహా ప్రాక్సీ ఓటును ఎంచుకున్న సేవా ఓటర్లు,యూనియన్ సాయుధ దళ సభ్యులు,1950 ఆర్మీ చట్టం వర్తించే ఇతర దళాల సభ్యులు, భారతదేశం వెలుపల విధుల్లో ఉండే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, గైర్హాజరీ ఓటర్లతో సహా నోటిఫైడ్ ఓటర్లు,80ఏళ్ల పైబడిన ఓటర్లు,40 శాతం పైబడిన దివ్యాంగులు,కొవిడ్-19 సోకిన ఓటర్లు బ్యాలెట్ వినియోగించుకోవచ్చన్నారు.

వీరుళ్లమ్మ,బాపనమ్మ సొమ్ముపై లెక్కజెప్పండి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 12 : అనపర్తి గ్రామ దేవతలు వీరుళ్లమ్మ, బాపనమ్మ అమ్మవార్ల సొమ్ముల భద్రతపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఉత్సవ కమిటీల ప్రతినిధులపై ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.అనపర్తిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ అమ్మవారికి వస్తున్న చందాలు, ఎంత ఖర్చు చేస్తున్నారన్న అంశాలపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయన్నారు. ఇటీవల ఒక వడ్డీ వ్యాపారి ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి ఆశీస్సులతో తక్కువ వడ్డీకి సొమ్ములు తీసుకుని అధిక వడ్డీలకు తిప్పుతున్నట్టు తెలిసిందన్నారు. బాపనమ్మ తల్లి చందాల్లో కొంత మొత్తాన్ని వడ్డీకి తిప్పుతున్నట్లుగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులే స్వయంగా చెప్పారన్నారు. జాతర మహోత్సవానికి ఎక్కడెక్కడి నుండో వచ్చే చిరు వ్యాపారుల నుంచి గతేడాది రూ.800 వసూలు చేయగా ఈ ఏడాది రూ.1400 వసూలు చేసేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఏటా వీరుళ్లమ్మ జాతర మహోత్సవాలకు కోట్లాది రూపాయలు వస్తున్నాయని నిల్వ ఎంత ఉంది ఎక్కడ ఉందనే దానిపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్, నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఓగిరెడ్డి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండగ బాదుడు!



స్పెషల్ పేరిట దోపిడీ..

- బస్ రూట్‌లోనే రైళ్లు
- రైళ్లను రద్దు చేసి 'ప్రత్యేక' రుద్దుడు
- సీజన్ మాటున బస్సుల బాదుడు
- పండుగ పేరిట చార్జీలు పెంపు
- 17వ తేదీ వరకూ రైళ్లన్నీ ఫుల్
- బస్‌ల రిజర్వేషన్లదీ ఇదే పరిస్థితి
- ప్రైవేటు బస్సుల్లో శ్రుతి మించి ధరలు
- అరకొరగా ఆర్టీసీ సర్వీసులు
- భారంగా గోదావరి జిల్లాల ప్రయాణం

బాదుడే బాదుడు.. పండుగ బాదుడు.. బస్ ఎక్కి దిగితే బాదుడు.. రైలు ఎక్కి దిగితే బాదుడు.. చార్జీలు మళ్లీ పెంచలేదు కానీ... పండుగ పేరిట దోపిడీకి తెరతీశారు.. ప్రయాణికుల జేబు ఖాళీ చేస్తున్నారు. గతంలో పండుగ సమయంలో ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో మాత్రమే స్పెషల్ దోపిడీ ఉండేది.. ఆ దారిలో రైల్వే శాఖ నడుస్తోంది. దీంతో ప్రయాణికులు ఎక్కడికక్కడ ఇదేం బాదుడురా బాబూ అంటూ తలలు పట్టుకుంటున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతికి ఊరెళదామన్నా బాదుడే బాదుడు.. ఒకరు 'ప్రత్యేకం'గా బాదేస్తుంటే.. మరొకరు సీజన్ మాటున రుద్దేస్తున్నారు. ఏదేమైనా పెద్ద పండుగ పేరుతో జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేసే పాలకులు మాత్రం కానరావడం లేదు.పెద్ద పండుగకు హైదరాబాద్ నుంచి ఎక్కువగా గోదావరి జిల్లాలకు రాకపోకలు సాగుతాయి. ఈ నేపథ్యంలో స్పెషల్ రైళ్లంటూ రైల్వే, ప్రత్యేక బస్సులంటూ ఆర్టీసీ, సీజనంటూ ప్రైవేటు ట్రావెల్స్.ఇలా ఎవరి మార్గంలో వారు అవసరాన్ని ఆసరాగా చేసుకొని అదనపు ఆదాయాన్ని గల్లాపెట్టెల్లో వేసుకుంటున్నారు. డీజిల్ ధర పెరిగినందున బస్సుల చార్జీలు.. విద్యుత్ ధరలు పెరిగాయని రైల్వే టికెట్ ధరలు పెంచితే మన అసహనానికి కాస్త సర్దిచెప్పుకోవచ్చు. కానీ పండుగ పేరు చెప్పి దోపిడీకీ తెరతీస్తున్నారు. అదే పట్టాలు.. అవే రైళ్లు, అదే డీజిల్ ధర.. అవే రోడ్లు.. మరి చార్జీలు ఎందుకు పెరిగాయని ఒకవేళ ఎవరైనా ప్రశ్న వేసుకుంటే.. సమాధానం మాత్రం ఒక్కటే.. అదే పండుగ ప్రయాణాలు. దీనికి సీజన్ అని ఓ పేరు పెట్టారు. సాధారణంగా ప్రజల అవసరాలకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుంది. కానీ ఆ అవసరాలను అదనపు ఆదాయానికి ఆధారంగా ఎంచుకోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. సంక్రాంతి 'స్పెషల్' దందాపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

జనరల్ బోగీలా రిజర్వేషన్ బోగి



మంగుళూరులో ఉద్యోగం చేస్తున్నా.. పండక్కి రావాలని రెండు నెలల కిందటే రిజర్వేషన్ చేయించుకున్నా.. ముగ్గురు స్నేహితులం చెన్నై భువనేశ్వర్ రైలులో రాజమహేంద్రవరం బయలుదేరాం. రిజర్వేషన్ ఎందుకు చేయించుకున్నామో మాకే తెలియలేదు. ఎందుకంటే రిజర్వేషన్ బోగి జనరల్ బోగిలా మారింది. నేను నా ఇద్దరు స్నేహితులు తాడేపల్లిగూడెం నుంచి గేటు దగ్గరకు రావడానికి ప్రయత్నిస్తే రాజమండ్రిలో రైలు ఆగి బయలుదేరే సమయానికి నేనొక్కడినే అతికష్టంమీద దిగగలిగాను.నా స్నేహితులు దిగలేకపోయారు.

- దిలీప్, రాజమహేంద్రవరం

రైల్వే 'స్పెషల్' తెలివి

రైల్వే 'స్పెషల్' తెలివితేటలకు ప్రయాణికులు మండిపడుతున్నారు.ఇటీవల పనులు/సాంకేతిక కారణాలను చూపుతూ రైళ్లను రద్దు చేయడం,దారి మళ్లించడం, పాక్షికంగా రద్దు చేయడం వంటి జిమ్మిక్కులు చేస్తున్నారు. రైలు వస్తే వచ్చినట్టు లేకపోతే లేనట్టు అనే స్థాయికి పరిస్థితి దిగజారింది. అయితే రెగ్యులర్ రైళ్లను రద్దు చేస్తూ ప్రత్యేక రైళ్లను వేస్తున్నారు.అవే పట్టాలు, అదే దారి.. ప్రత్యేకత ఏమిటో తెలియక ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు.ప్రత్యేక రైళ్లు వేయడానికి ర్యాక్ (బోగీ)ల కొరత ఉందంటూ రైల్వే దాటవేత ధోరణి అవలంబిస్తోంది. అయితే రద్దు చేసిన రైళ్ల బోగీలు ఏమి చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఉంది. రద్దు చేస్తున్న రైళ్ల బోగీలకు ఇంజన్‌ని తగిలించి ప్రత్యేకం పేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారంటూ ప్రయాణికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.రోజూ ప్రయాణికుల ఆదరణ ఉండే రైళ్లనూ రోజుల తరబడి దూరం చేస్తుండడంపై మండిపడుతున్నారు.

రైళ్లన్నీ ఫుల్ వెయిటింగ్..

రోజువారీ రాకపోకలు సాగించే రైళ్లలో ఇప్పటికే ఏసీలతో సహా బెర్తులన్నీ నిండిపోయాయి. సికింద్రాబాద్ నుంచి ఈ వారంలో రానుపోను కాకినాడ, శ్రీకాకుళం, విశాఖ నుంచి 8 సర్వీసులను వేశారు.గురువారం మధ్యాహ్నానికి వీటిలో కూడా ఖాళీలు లేవు. 12,13 రిజర్వేషన్లు అయిపోయాయి.ఓ స్పెషల్ ట్రైనుకు స్లీపర్ వెయిటింగ్ లిస్ట్ 340 ఉంది.గౌతమికి వెయిటింగ్ లిస్ట్ 475కి చేరడంతో రిజర్వేషన్లు ఆపేశారు. కోకనాడ ఎక్స్‌ప్రెస్ కూడా అదే పరిస్థితి. స్లీపర్,థర్డ్, సెకండ్, ఫస్ట్ ఏసీలు నో రూమ్ చూపిస్తున్నాయి. తత్కాల్‌లో దొరికితే బాగా అదృష్టమే అని చెప్పాలి. 11న సికింద్రాబాద్ నుంచి ఇటువైపునకు రాజమండ్రిలో తత్కాల్‌లో కేవలం ఒకరికి మాత్రమే టిక్కెట్ బుక్కయింది. వందేభారత్, గరీబ్‌రథ్, జన్మభూమి, కోణార్క్, గోదావరి, విశాఖ, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లూ నిండిపోయాయి.



జనంపై చార్జీల మోత..

రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వే ప్రత్యేక రైళ్లను వేయడం పరిపాటి. అయితే వాటిలో చార్జీల మోత మోగుతోంది. సికింద్రాబాద్ నుంచి రాజమండ్రికి గోదావరి, గౌతమి తదితర రోజువారీ సాధారణ రైళ్లలో స్లీపర్ క్లాస్ రూ.325, థర్డ్ ఏసీ రూ.835 ఉండగా ప్రత్యేక రైళ్లలో స్లీపర్ రూ.385, 405 ఉంది. థర్డ్ ఏసీ రూ.835కిగాను ప్రత్యేక రైళ్లలో రూ.1050, రూ.1120 చెల్లించాల్సి వస్తోంది. వందే భారత్ 12న వెయిటింగ్ 200 ఉండగా, 13న 234 ఉంది. ఈ రైలుకు చైర్‌కార్(సిట్టింగ్) రూ.1365, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌కి రూ.2465 టికెట్ ధర ఉంది. థర్డ్ క్లాస్ ఏసీ రైలు గరీబ్‌రథ్‌కి వెయిటింగ్ 12న టికెట్లు నిండుకోగా 13న వెయిటింగ్‌లిస్ట్ 203 కొనసాగుతోంది. ఏపీ ఎక్స్‌ప్రెస్‌ని విశాఖ నుంచి దారిమళ్లించారు. రాజమండ్రి దారిలో 10 నుంచి 14వ తేదీ వరకూ అనుమతించారు. స్వర్ణజయంతి, పూరీ-ఓకా, విశాఖ-గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్‌లు విశాఖ నుంచి అటుగా వెళ్లిపోతున్నాయి. జన్మభూమి మినహాయిస్తే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు ఏమీ లేవు. దీంతో దగ్గరి ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు సుదూరంగా ప్రయాణాలు సాగించే రైళ్లలో ఎక్కితే నరకం కనిపిస్తోంది. ఇటు నుంచి ప్రయాణికుల ఆదరణ ఉండే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను చాలా రోజుల నుంచీ ఆపేశారు. ఇప్పుడు పండుగ సందర్భంగా 10 నుంచి 14వ తేదీ వరకూ నడుపుతున్నా.తర్వాత ఫిబ్రవరి నెలాఖరు వరకూ ఈ రైలు కనబడదు. విశాఖ-విజయవాడ ఉదయ్ డబుల్ డెక్కర్,గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌లను పండుగకు నాలుగు రోజుల పాటు కనికరించారు. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు లేకపోవడంతో రద్దీ క్లియర్ కావడం లేదు. చెన్నై -సిల్చార్, గువాహటి-బెంగళూరు ఇలా సుదూర ప్రాంతాలకు ప్రయాణించే సుమారు 5 ప్రత్యేక రైళ్లను వేసిన వాటి లో స్లీపర్ బోగీల్లో కాలు పెట్టలేని పరిస్థితుల్లో నడుస్తున్నాయి.

బస్సుల్లోనూ బాదుడు..

పండుగ వచ్చిందంటే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులకు లాభాల పండుగ వచ్చినట్లే. సాధారణ రోజులకంటే వందారెండొందల శాతం ధరలు అమాంతం పెంచేస్తారు. సికింద్రాబాద్ నుంచి రాజమండ్రి, కాకినాడకు సాధారణ రోజుల్లో రూ.800-రూ.1200 ఉంటే ఇప్పుడు కనీసం రూ.2వేలు చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇక స్లీపర్, సూపర్, అల్ట్రా ఇలా.. వివిధ రకాల పేర్లు పెట్టి సదుపాయాల మాటున విపరీతంగా ధరలు నిర్ణయిస్తున్నారు. రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ పెరగడంతో బస్సులు తప్ప ప్రయాణికులకు రెండో ఆప్షన్ లేదు. ఇదే అదనుగా అదనంగా పిండేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఆర్టీసీ కూడా మాట రాకుండా ఉండేందుకు అరకొర ప్రత్యేక సర్వీసులను వేస్తూ చేతులు దులుపుకుంటోందనే విమర్శలున్నాయి. రద్దీ అధికంగా ఉన్నా ఆ మేరకు సర్వీసులు లేకపోవడంతో సికింద్రాబాద్‌లోని ఎంజీబీఎస్, ఈసీఐఎల్, కూకట్‌పల్లి, అమీర్‌పేట, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో బస్సు పాయింట్లు గోదావరి జిల్లాలకు పండుగకు రావాల్సిన ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఆన్‌లైన్‌లో టికెట్లు తీసుకోని ప్రయాణికుల వద్ద నుంచి ప్రైవేటు ట్రావెల్స్ వాళ్లు ఇష్టానుసారం ధరలు బాదేస్తున్నారని జనం గగ్గోలు పెడుతున్నారు. ఇక ఏదైనా కారు కిరాయికి మాట్లాడుకున్నా రూ.30వేలపైనే డిమాండు చేస్తున్నారని చెబుతున్నారు. పండుగ ప్రయాణానికి ఇన్ని తిప్పలు పడుతున్నా యంత్రాంగం మిన్నకుండడంపై ప్రయాణికులు తీవ్రంగా మండిపడుతున్నారు. అవసరానికి అక్కరకు రాని సదుపాయాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు.



నల్లజర్లలో ఆందోళన చేస్తున్న పీఈటీలు

మేం ఆడించలేం!

- 18న ఆడుదాం - ఆంధ్రాపై పీఈటీల విముఖత
- సౌకర్యాలు కల్పించాలని నల్లజర్లలో ఆందోళన

నల్లజర్ల,జనవరి 12 : ఆడుదాం ఆంధ్రా అంటూ హడావుడి తప్ప.. క్షేత్రస్థాయిలో మాత్రం పీఈటీలు వెనుకంజ వేస్తున్నారు. కనీసం నిర్వహణ ఖర్చులకు నిధులివ్వకపోవడంతో లబోదిబోమంటున్నారు. క్రీడల నిర్వహణపై విముఖత చూపుతున్నారు. నల్లజర్ల మండలంలో ఘటనే అందుకు నిదర్శనం. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రాలో క్రీడాకారులు, పీఈటీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో మండల పరిషత్ అధికారులు విఫలమయ్యారని నల్లజర్ల మండల పీఈటీలో శుక్రవారం నల్లజర్ల హైస్కూల్‌లో నిరసన వ్యక్తం చేశారు. క్రీడాకారులకు తాగునీరు,నెట్, వాలీబాల్,ఇతర క్రీడా సామగ్రి పూర్తి స్థాయిలో అందించలేకపోతున్నారని వాపోయారు.పీఈటీలకు భోజన సదుపాయం సైతం ఎవరికి వారే తెచ్చుకోవాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు.మా అంతట మేం అన్నీ చేసుకుంటే మీరేం చేస్తారని ప్రశ్నించారు. ఏర్పాట్లు చేయకుండా ఆడుదాం ఆంధ్రా అంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు నిర్వహణ ఏర్పాట్లు పటిష్ఠంగా చేస్తేనే తాము 18వ తేదీ నుంచి క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. ఆందోళనలో పీఈటీల సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే.వి.వెంకట్రావు, పల్లి వెంకట అప్పారావు, పీఈటీలు డి.రాజారావు,టీ త్రిపుర స్వాతి,టి.రాంబాబు పాల్గొన్నారు.



డి.ముప్పవరంలో సిద్ధమైన బరి

బరి తెగించారు!

- గ్రామాల్లో సిద్ధమవుతున్న బరులు
- అనుమతులకు ఎదురుచూపులు
- డి.ముప్పవరంలో బరులకు ఏర్పాట్లు

నిడదవోలు, జనవరి 12 : సంక్రాంతి వస్తుందంటే కోడిపందేల నిర్వాహకులు బిజీబిజీ.. ఔనన్నా కాదన్నా నిర్వాహకులు బరితెగిస్తారు.మూడు రోజులు పండగ చేసుకుంటారు. అధికారపార్టీ నేతల ఆధ్వర్యంలో జరుగుతున్న కోడిపందేల బరులకు ప్రభుత్వ అధికారులు పూర్తిగా సహకారం అందించేస్తుంటారు. పైకి మాత్రం కోడిపందేలు వేసినా, చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినా చర్యలు తప్పవంటూ హెచ్చరికలు మాత్రమే జారీ చేస్తారు. ఎంత బలంగా హెచ్చరికలు చేస్తే అంత బరువుగా లబ్ధిని పొందుతారు. ఒకే గ్రామంలో అదీ ప్రధాన మార్గంలో మూడు బరులు సిద్ధమవుతున్నా అటువైపు చూసే అధికారులైె కరు వయ్యారు. నిడదవోలు మండలం డి.ముప్పవరం నుంచి గోపవరం వెళ్ళే రోడ్డులో ప్రతీ ఏడాది కోడిపందేల బరులు వేస్తారు. ప్రతీ ఏడాది లాగే ఈ ఏడాది మూడు బరులు అధికారపార్టీకి చెందిన నేతల కనుసన్నల్లో సిద్ధమవుతున్నాయి. అయితే అటువైపు చూసిన అధికారులే లేరు. పోనీ అదేదో మారుమూల ప్రాంతం కాదు. కొబ్బరితోటల్లో మట్టిని చదును చేసి బరులు సిద్ధం చేశారు. ఇక పైనుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే అప్పటికప్పుడు బరుల చుట్టూ పెన్సింగ్, లైటింగ్, టెంట్లు యుద్ధప్రాతిపదిక సిద్ధమవుతాయి. ఇప్పటికే పోలీస్ రెవెన్యూ శాఖాధికారులు గ్రామాల్లో సభలు పెట్టి తూతూమంత్రంగా హెచ్చరికలు జారీచేయడమే తప్ప చిత్తశుద్ధితో కోడిపందేలు, గుండాట, కోతాట అరికట్టేందుకు చర్యలు చేపట్టడం లేదనడానికి ఈ సంఘటనే నిదర్శనంగా ఉంది.ఇప్పటికైనా డి.ముప్పవరం బరులపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి కోడిపందేలు నిరోధించాలని ప్రజలు కోరు తున్నారు.

కన్నుపడితే కూల్చుడే!

మొన్న జియోన్ అంధుల పాఠశాల.. నేడు చర్చి, టాక్సీస్టాండ్ కూల్చివేత



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జియోన్ అంధ పాఠశాల విద్యార్థుల ధర్నా



జేసీబీతో చర్చి కూల్చివేత

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12 : ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన జగన్ పరిపాలన పరంపర కొనసాగుతూనే ఉంది. సీఎం జగనే కాదు.. వైసీపీ నాయకులు అలాగే ఉన్నారు.. రాష్ట్రంలో వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధుల కన్నుపడితే కట్టడాలు కూలిపోతున్నాయి.. బాధితులు లబోదిబోమన్నా కనీసం పట్టించుకోవడంలేదు. రాజమహేంద్రవరంలో గత నాలుగు దశాబ్దాల కుపైగా అంధ విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పిన జియోన్ అంధుల పాఠశాలను పునాదులతో లేపేశారు.అంధ విద్యార్థులను మరొక పాఠశాలకు తరలించేశారు. పాఠశాలలను నిలబెట్టాల్సిన ప్రభుత్వమే కూల్చివేయడంతో దిక్కుతోచనిస్థితిలో అంధ విద్యార్థులు ఉన్నారు. ఈ సంఘటన మరువక ముందే రాజమహేంద్రవరంలో మరొక ఘటన చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం కంబాలచెరువు పార్కును ఆనుకుని హైటెక్ బస్టాండ్ పక్కనే ఉన్న క్రీస్తుసంఘం ప్రార్థనా మందిరం (చర్చి)ను శుక్రవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అధికారులు కూల్చివేశారు. ఎంపీ భరత్ రామ్ ఒత్తిడి వల్లే ఈ చర్చిని కూల్చివేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. 1983 నుంచి పోరంబోకు స్థలంలో ట్యాక్సీ స్టాండ్ ఉండేది.ఆ స్థలంలోనే గత 20 ఏళ్ళ కిందట క్రీస్తు ప్రార్థనామందిరాన్ని నిర్మించి ప్రార్థనలు చేసుకుంటున్నారు. ఈ స్థలం విషయంలో కార్పొరేషన్‌కు బాధిత క్రైస్తవులు, ట్యాక్సీస్టాండ్ నిర్వాహకులకు కోర్టులో కేసు నడుస్తుంది. ఈ నేపథ్యంలో గత నెల 26న మునిసిపాలిటికి అనుకూలంగా రాజమండ్రి 5వ కోర్టు తీర్పు ఇచ్చింది.దీంతో కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో కార్పొరేషన్ సిబ్బంది జేసీబీని తీసుకువచ్చి శుక్రవారం చర్చిని కూల్చివేశారు. ప్రార్థన జరుగుతున్న సమయం కావడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చర్చిని కూల్చడానికి వీల్లేదని ఎండీ.సుబియారాణి,పుట్టా బుజ్జమ్మ, సోమబత్తుల కాంతం ,వి.మంగ, బేబి, లక్ష్మి అడ్డుకున్నారు. కోర్టుకు అప్పీల్ చేసేందుకు సమయం ఉన్నప్పటికీ కేవలం ఎంపీ భరత్ రామ్ ఒత్తిడి వల్లనే చర్చి, ట్యాక్సీ స్టాండ్‌లను కూల్చివేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. అడ్డుకోవడానికి యత్నించిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దివ్యాంగులు, అంధులకు నీడ కల్పించాలి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 12 : రాజమండ్రి ఎంపీ భరత్‌రామ్ అంధులు, దివ్యాంగుల జీవితాలతో ఆటలాడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ సిటీ కన్వీనర్ అనుశ్రీ సత్యనారాయణ ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం జియోన్ అంధుల పాఠశాలకు చెందిన దివ్యాంగులు, అంధులైన విద్యార్థులు ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని, మెరుగైన ప్రత్యామ్నాయం చూపించాలని నిరసన చేపట్టారు. వీరికి తెలుగుదేశం, జనసేన, సీపీఐ, సీపీఎంలు, పలు దివ్యాంగుల సంక్షేమ సంఘాలు సంఘీభావం తెలిపారు. అంధులు, దివ్యాంగులపై కనీస జాలిలేకుండా ప్రతాపం చూపించి రోడ్డున పడేయడం వైసీపీ నాయకుల దుర్మార్గానికి నిదర్శనమన్నారు. జీజీహెచ్‌లోని జియోన్ పాఠశాల స్థలాన్ని ఎవరికో లీజుకు ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందుకే ఎంపీ భరత్‌రామ్ నోరు మెదపడంలేదన్నారు. ఈ స్థలాన్ని వైద్యకళాశాలకు కేటాయించారని బయటకు చేస్తున్నది కేవలం ప్రచారం మాత్రమే అన్నారు. అధికారులు, యాజమాన్యానికి ఏ గొడవలు ఉన్నాయో తమకు తెలీదని, అంధులు, దివ్యాంగ విద్యార్థులను ఇలా రోడ్డున పడేయడం చాలా అన్యాయమని, వీరికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, బుడ్డిగ రాధా, జనసేన పార్టీ నాయకులు వైశ్రీను, తెలుగుదేశం, జనసేన, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.


పోతవరంలో బరి ధ్వంసం

నల్లజర్ల,జనవరి 12 : నల్లజర్ల మండలం పోతవరంలో కోడి పందేల బరి ధ్వంసం చేసినట్టు సీఐ కె.దుర్గా ప్రసాద్ తెలిపారు. పోతీనీడుపాలెం,పోతవరం గ్రామాల్లో గతంలో కోడి పందేలు వేసే ప్రదేశాలను శుక్రవారం పరిశీలించారు.పోతవరంలో బరి ఏర్పాటు చేయడంతో ధ్వంసం చేశామన్నారు. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. కోడి కత్తులు కట్టే వారిని గుర్తిస్తున్నామని,బరులు వేసి వారిని అదుపులోకి తీసుకుని కోడి పందాలు జరగకుండా అడ్డుకుంటామన్నారు.ఆయన వెంట ఎస్ఐ టీవీ. సురేష్‌,తహసీల్దార్ కిషోర్‌కుమార్ ఉన్నారు.





బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న శేషారావు




షరీఫ్ (ఫైల్)

టీడీపీ చొరవ చూపింది.. కడసారి చూపు దక్కింది!

మలేషియా నుంచి మృతదేహాన్ని రప్పించిన తెలుగుదేశం

నిడదవోలు, జనవరి 12 : ఉపాధి నిమిత్తం మలేషియా వెళ్లిన ఒక వ్యక్తి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతిచెందగా టీడీపీ నాయకుల చొరవతో శుక్రవారం స్వగ్రామానికి చేరింది.నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి చెందిన షేక్ గాలిబ్ షరీఫ్ (45) ఐదేళ్ళ కిందట ఉపాధి నిమిత్తం మలేషియా వెళ్ళాడు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత నెల డిసెంబరు మూడో వారంలో గుండెపోటుతో మృతి చెందాడు. సుమారు 20 రోజుల తరువాత కోరు మామిడిలో కుటుంబీకులకు షరీఫ్ మృతిచెందాడని తెలిసింది. మృతదేహాన్ని ఇండియాకు పంపించేందుకు లక్షల్లో ఖర్చు అవుతుందని కుటుంబీకులకు సమాచారం వచ్చింది. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం.. దీంతో ఏం చేయాలో పాలుపోలేదు. ఏదో ఒక విధంగా తన భర్త మృతదేహాన్ని ఇండియాకు తీసుకొచ్చి కడసారి చూసుకోవాలని భార్య ప్రయత్నాలు ఆరంభించింది.ఈ విషయాన్ని టీడీపీ కార్యకర్త ఇస్మాయిల్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు దృష్టికి తీసుకువెళ్ళాడు. దీనిపై స్పందించిన శేషారావు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలోని టీడీపీ ఎన్ఆర్ఐ సెల్ కో ఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్‌తో చర్చించారు. మలేషియాలోని తెలుగు ప్రవాసితుల సంఘం ప్రతినిధులైన ఆనంద్, కిరణ్‌లను సంప్రదించి వారి సహకారంతో అక్కడ తెలుగువారి ఆర్థిక సహకారంతో షరీఫ్ మృతదేహాన్ని శుక్రవారం నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి తీసుకువచ్చారు.మృతదేహాన్ని చూసుకుని బాధిత కుటుంబీకులు బోరున విలపించారు.బూరుగుపల్లి శేషారావు షరీఫ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మలేషియా నుంచి షరీఫ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చిన టీడీపీ ఎన్ఆర్ఐ విభాగానికి, మాజీ ఎమ్మెల్యే శేషారావుకు కుటుంబీకులు,గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మాధవీలత

త్వరలో సైన్స్ కేంద్రం ప్రారంభం : కలెక్టర్

రాజమహేంద్రవరం,జనవరి 12(ఆంధ్రజ్యోతి) : బొమ్మూరులో నిర్మించి సైన్స్ కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్టు జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు. సైన్స్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్టు అధికారి జేడీ రావు విశేషాలను ఆమెకు వివరించారు. సివిల్ పనులకు చెందిన అంచనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సైన్స్ సెంటర్ అధికారులు డ్రైనేజీ వ్యవస్థ, కాంపౌండ్ వాల్ సమస్యను కలెక్టర్‌కు వివరించారు.ఆమె వెంట ఫీల్డ్ ఆఫీసర్ పి.సత్యనారాయణ, హార్టికల్చరిస్టు సీఎస్.స్వామి, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎస్వీవీ.రెడ్డి, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామి నాయుడు, ఎస్ఈ పీఆర్ ఏబీవీ.ప్రసాద్, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్ డి.బాలశంకరావు, డీజీవో జె సత్యనారాయణ పాల్గొన్నారు.





కొబ్బరి చెట్లు.. చేలగట్ల మధ్య.. ప్రకృతి ఒడిలో..

ఆధ్యాత్మిక జాతర!

- 16న జగ్గన్నతోట ప్రభల తీర్థం
- కోనసీమలో ఉత్సవాలకు ఏర్పాట్లు
- జగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి ప్రముఖుల గుర్తింపు
- 2020లో ప్రధాని మోదీ.. శివకేశవ యూత్‌కి లేఖ
- 2021లో ఏకాదశ రుద్రులపై శృంగేరి పీఠాధిపతుల సందేశం
- 2023లో ఢిల్లీ రిపబ్లిక్‌డే పరేడ్‌లో ఏకాదశ రుద్రుల శకటం
- ఏకాదశ రుద్రుల దర్శనానికి పోటెత్తనున్న భక్తులు
- ఈ ఏడాది 3 లక్షల మంది వచ్చే అవకాశం



ఢిల్లీలో గత ఏడాది జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో ఏకాదశరుద్రుల శకటం

అంబాజీపేట, జనవరి 12: భూమాత పరిచిన పచ్చని తివాచీల్లాంటి వరి చేలు.. ఆ తల్లి ప్రతిష్ఠించిన స్వాగతకేతనాల్లాంటి కొబ్బరి చెట్లు నడుమ.. నేలకు దిగి వచ్చిన ఇంద్రధనస్సులా సాగే కోనసీమ ప్రభల తీర్థం ఓ దృశ్య కావ్యం వంటిది. జీవన విధానంలో ఆధునికత ఎంత సంతరించుకుంటున్నా సంప్రదాయం చెక్కుచెదరట్లేదనడానికి నిదర్శనంగా నిలుస్తోంది ప్రభల తీర్థం. ఆధ్యాత్మికతకు అందాన్ని జోడిస్తూ కోనసీమలో జరిగే వన్నెల పర్వమే జగ్గన్నతోట ప్రభల తీర్థానికి ఈ ఏడాది దాదాపు మూడు లక్షల మంది వచ్చే అవకాశం ఉందని అంచనా. ప్రతిఏటా కనుమ రోజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవం జరుగుతుంది. 2020 సంవత్సరంలో గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులు జగ్గన్నతోట ప్రభల తీర్థం విశిష్టతను వివరిస్తూ ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాశారు. దానికి స్పందించిన ఆయన ప్రతి లేఖ రాశారు. ఏకాదశ రుద్రుల ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని ఆకాంక్షించారు. 2021లో శృంగేరీ పీఠాధిపతికి లేఖ రాయగా ఉత్తరాధికారి విదు శేఖర భారతీస్వామి ఏకాదశ రుద్రుల ప్రాశస్త్యంపై సందేశం పంపించారు. 2023లో ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ పెరేడ్‌లో జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శకటంగా శకటంగా ప్రదర్శనలో పాల్గొంది. దీనిని వీక్షించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోపాటు పలువురు ప్రముఖులు తన్మయత్వం చెందారు. దీంతో ప్రపంచం నలమూలలకు ఏకాదశ రుద్రుల ఖ్యాతి విస్తరించింది. గతేడాది కార్తిక మాసంలో ఏకాదశ రుద్రుల దర్శనానికి గోదావరి జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సంక్రాంతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సుమారు 120 గ్రామాల్లో ప్రభల తీర్థాలు ఘనంగా జరుగుతాయి. వీటిని కనులారా తిలకించేందుకు ఈ ప్రాంతాలకు చెంది దేశ, విదేశాల్లో స్థిరపడ్డ ప్రముఖులు తప్పకుండా విచ్చేస్తారు. ప్రత్యేకంగా అలంకరించిన ఈశ్వరుని ప్రతిరూపంగా పిలిచే ప్రభలను గ్రామాల్లో ఊరేగిస్తే శాంతి సౌభాగ్యాలు చేకూరతాయనేది పూర్వీకుల ఉవాచ. శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంత పురోభివృద్ధి సాధించినా.. అధునాతన వాహనాలు అందుబాటులోకి వచ్చినా సంప్రదాయబద్ధంగా బండెనక బండి కట్టి రెండెడ్ల బళ్లపైనే ప్రజలు ప్రభల తీర్థాలకు రావడం అనవాయితీ. కొత్తపేట, జగ్గన్నతోట, మామిడికుదురు, అంబాజీపేట, బండారులంక, తొండవరం, చిరతపూడి, ముమ్మిడివరం, అయినవిల్లి, ఐ.పోలవరం, పోతవరంల్లో జరిగే ప్రభల తీర్థాలు ముఖ్యమైనవి.

జగ్గన్నతోట తీర్థానికి ప్రత్యేక విశిష్టత

సుమారు 450 ఏళ్ల కిందట నుంచి కనుమ పండుగ నాడు నిర్వహించే జగ్గన్నతోట ప్రభల తీర్థానికి ప్రత్యేక విశిష్టత ఉంది. మకర సంక్రమణం, ఉత్తరాయణ మహాపుణ్యకాలంలో అంబాజీపేట మండల మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే తీర్థం చారిత్రాత్మకమైనది, పవిత్రమైనది. ప్రాచీన కాలంలో తొలిసారిగా ఇక్కడ ప్రభల తీర్థం నిర్వహించారని భోగేశ్వరస్వామి ఆలయంలోని రాగి శాసనాన్ని బట్టి తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఎలాంటి గుడి, గోపురం లేకుండానే ఏడు ఎకరాల కొబ్బరితోటలో తీర్థం నిర్వహించడం ప్రత్యేకత. హిందూశాస్త్రం ప్రకారం ఏకాదశ రుద్రులు కొలువుదీరేది దేశం మొత్తం మీద జగ్గన్నతోట ఒక్కటే. 17వ శతాబ్దంలో కనుమ నాడు ఏకాదశ రుద్రులు లోక కల్యాణార్థం ఇక్కడ సమావేశమయ్యారని చారిత్రక కథనం. పెద్దాపురం సంస్థానాధీశులైన రాజా వత్సవాయి జగన్నాథ మహారాజు (జగ్గన్న) ఇక్కడకు విచ్చేసి ఏకాదశ రుద్రులను దర్శించుకుని ప్రభల తీర్థాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక కృషిచేశారని.. అప్పట్నుంచీ ఈ ప్రాంతాన్ని జగ్గన్నతోటగా పిలుస్తున్నారని చరిత్ర ఆధారాలను బట్టి తెలుస్తోంది.

పచ్చని చేలను తొక్కుకుంటూ...

గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ప్రభలను ఆయా గ్రామాల యువకులు పంటచేలను తొక్కుకుంటూ అప్పర్ కౌశికను దాటించే సుందర దృశ్యాలను చూసేందుకు వేలాది మంది పోటీపడతారు. అలాగే తొండవరం, వాకలగరువు ప్రభలు 42 అడుగుల ఎత్తులో ఉంటాయి. వీటిని గ్రామం నుంచి తీర్థానికి తీసుకొచ్చే సమయంలో మార్గమధ్యంలో విద్యుత్ లైన్లను తాత్కాలికంగా తొలగిస్తారు. ప్రభల తయారీలో యువకులదే ముఖ్య పాత్ర. తాటిపట్టితో తయారు చేసిన నూలం, మర్రి, టేకు కలపతో తయారుచేసిన బల్ల వెదురు, పోకగెడలతో ప్రభలను తయారుచేసి రంగు రంగుల వస్త్రాలు, నెమలి పింఛాలు, పువ్వులు, ధాన్యం కుచ్చులతో అందంగా తయారు చేసి ఉత్సాహంగా గ్రామాల్లో ఊరేగిస్తారు.

ఆర్డీవో ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

జగ్గన్నతోటలో ఈనెల 16న జరిగే ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవానికి సుమారు 3 లక్షల మందికి పైగా వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పోలీసులు, అధికారులతో ఆయన సమీక్షించారు. ట్రాఫిక్, తాగునీరు, వైద్య సదుపాయం, బారికేడ్లు వంటి ఏర్పాట్లు కల్పిస్తున్నారు.

40 ఏళ్లుగా ప్రభ తయారు చేస్తున్నా..



గంగలకుర్రు అగ్రహారం శ్రీవీరేశ్వరస్వామి వారి ప్రభను యువకుల సాయంతో సుమారు 40 ఏళ్లుగా తయారు చేస్తున్నాను. ప్రభ తయారీకి చాలా అనుభవం, ప్రావీణ్యం కావాలి. ప్రభ పంటచేలు, కౌశిక నది దాటాల్సి ఉన్నందున అత్యంత పటిష్ఠంగా తయారుచేస్తున్నాం.

- శ్రీపాద వెంకటరమణ, జి.అగ్రహారం

పరమశివుడే మా చేలలో వెళ్లినట్టు..



గంగలకుర్రు అగ్రహారం శ్రీవీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి రుద్ర ప్రభలు మా పంట చేల మీదుగా వెళితే ఆ పరమశివుడే వెళ్లినట్టు భావిస్తాం. ఈవిధంగా ఊడ్చిన చేలను ఎంతో మంది భక్తులు తొక్కుకుంటూ వెళ్లినా బాగా పండుతాయి.

- పితాని సత్తిబాబు, రైతు, గంగలకుర్రు


పాశర్లపూడిలో పైపులైన్ నుంచి స్వల్పంగా లీకవుతున్న గ్యాస్

పాశర్లపూడిలో పైపులైన్ నుంచి గ్యాస్ లీక్

మామిడికుదురు, జనవరి 12: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో గెయిల్‌కు చెందిన పైపులైన్ నుంచి గ్యాస్ శుక్రవారం స్వల్పంగా లీకైంది. పాశర్లపూడి ఓఎన్జీసీ చమురు బావి నుంచి గ్యాస్ నగరం జీసీఎస్‌కు ఈ పైపులైను నుంచి సరఫరా అవుతోంది. నెల రోజుల కిందట ఈ పైపులైను లీకవడంతో అధికారులు తూతూమంత్రంగా మరమ్మతులు నిర్వహించి వదిలేశారని, మళ్లీ అక్కడే శుక్రవారం పైపులైను లీకైందని రైతులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అయితే ఓఎన్జీసీ అధికారులు పైప్‌లైన్‌ను పరిశీలించి వెళ్లారు. అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి పైపులైనుకు పూర్తి స్థాయిలో శాశ్వత మరమ్మతులు నిర్వహించాలని వారంతా కోరుతున్నారు.

మూడు టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయవరం, జనవరి 12: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరం గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్టు ఎస్ఐ జి.నరేష్ తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని బొలెరో వాహనంలో మాచవరం నుంచి బిక్కవోలు తరలిస్తుండగా రాయవరంలో పట్టుకున్నామన్నారు. డ్రైవర్ షేక్ బషీర్‌ను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

కడుపునొప్పితో రైల్వే ప్రయాణికుడి మృతి

తుని రూరల్, జనవరి 12: కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో శాలిమార్ నుంచి చెన్నైకు వెళ్తుండగా బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ ఆల్మాగిరి హుస్సేన్ తీవ్ర కడుపునొప్పితో మృతి చెందాడు. దీన్ని గమనించిన ప్రయాణికులు తునికి చేరుకునే సరికి అత్యవసరంగా రైలు నిలుపుదల చేసి స్టేషన్‌లో గల రైల్వే డాక్టర్ పరిశీలించారు. అయితే అప్పటికే వ్యక్తి మృతి చెందడంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



తుని రూరల్, జనవరి 12: విశాఖపట్నం వైపు వెళ్తున్న రైలు నుంచి తుని రైల్వే పోలీసులు పరిధిలో గుల్లిపాడు వద్ద గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకోగా వ్యక్తి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారుఫ్ మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో సంబంధీకులు ఎవరైనా రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.


మృతి చెందిన వ్యక్తిని బయటకు తీస్తున్న దృశ్యం

అడవి పందులకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

- తోటి వేటగాళ్లు తప్పించుకునేందుకు

మృతి చెందిన వ్యక్తిని కాళ్లు కట్టేసి చెరువులో పడేసిన వైనం

జగ్గంపేట, జనవరి 12: వన్యప్రాణులను వేటాడడానికి వెళ్లిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి ప్రాణాలు కోల్పోయాడు. జగ్గంపేట తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామ శివారులో కంపిరి సత్యనారాయణ జీడిమామిడి గార్డెన్‌లో ప్రత్తిపాడు గ్రామానికి చెరుకూరి అచ్చిబాబు, ఎర్రా ఈశ్వర్, మేకల కార్తీక్ గురువారం రాత్రి వన్యప్రాణులను వేటాడడానికి వెళ్లారు. అక్కడ కాపవరపు సురేష్, ఎర్రా విష్ణు, బోదిరెడ్డి సుబ్బారావులు వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలు ఏర్పాటుచేశారు. వాటిని తాకడంతో కార్తీక్ (30) చనిపోయాడు. తర్వాత నిందితులు ముగ్గురూ కలిసి కార్తీక్ మృతదేహాన్ని గ్రామంలో ఉన్న చెరువులో పడేశారు. పోలీసులు శుక్రవారం మృతదేహాన్ని బయటకు తీశారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని ఎస్ఐ నాగార్జునరాజు తెలిపారు.

మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు హైకోర్టులో ఊరట

రంపచోడవరం, జనవరి12: అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు హైకోర్టులో ఊరట లభించింది. ఆమె ఎస్టీ కాదంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఆమె క్యాస్ట్ సర్టిఫికేట్‌ను రద్దు చేస్తూ ఇటీవల జీవోనెం.2ను ప్రభుత్వం జారీచేసింది. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. 2016లో తన కులాన్ని ఎస్టీగా కలెక్టరు నిర్ధారించినట్లు ఆమె తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారణ అనంతరం ప్రభుత్వం ఇచ్చిన జీవోను కోర్టు సస్పెండ్ చేసింది.

రాష్ట్ర బాడీబిల్డింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 12: పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో ఈనెల 14న జరిగే రాష్ట్ర బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లా నుంచి 8 మంది సభ్యుల జట్టు పాల్గొననుందని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడకు చెందిన వీరబాబు కెప్టెన్‌గా వ్యవహరిస్తారని, టీమ్ మేనేజర్ కం కోచ్‌గా రాజు హాజరవుతారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గోకవరం, జనవరి 12 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. రంపచోడవరం మండలం తామరపల్లి గ్రామానికి చెందిన కొంజం అఖిల్ (28) అనే యువకుడు శుక్రవారం రాత్రి మోటార్ సైకిల్‌పై వెళుతున్న సమయంలో కృష్ణుంపాలెం గ్రామ శివారులో బీఎస్ఆర్ కళాశాల సమీపంలో రంపచోడవరం వైపు వెళ్తున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అఖిల తలకు తీవ్రమైన గాయాలుకాగా స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19 నుంచి కులగణనకు శ్రీకారం : మంత్రి వేణు

రాజమహేంద్రవరం, జనవరి12(ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఈనెల 19న ఆవిష్కరించనున్న సందర్భంగా కులగణనకు శ్రీకారం చుట్టనున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు.. పక్కన టీడీపీ, జనసేన నేతలు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- బహిరంగ చర్చకు టీడీపీ సిద్ధం
- రూ.13 లక్షల కోట్ల అప్పుపై ఖర్చులు చెప్పాలి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల

మండపేట, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రం అప్పులపై చేసిన వ్యాఖ్యలకు పార్టీ కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిపై చర్చించేందుకు మంత్రి బుగ్గన సిద్ధమా అంటూ చాలెంజ్ విసిరారు. సీఎం జగన్ తన సొంత బడ్జెట్‌ను అమలుచేస్తున్నాడని యనమల ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణంలో బాబుఅండ్‌బాబు కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ, జనసేన నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ఆర్థిక లెక్కలపై అవగాహన లేదన్నారు. ఈ ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ప్రతి వ్యక్తిపై రూ.2.5 లక్షలు రుణ భారం పడిందన్నారు. ఈ ప్రభుత్వంలో చేస్తున్న ఖర్చులకు లెక్కాపత్రం లేకుండా పోయిందని యనమల ఆరోపించారు. ప్రభుత్వం చేసిన అప్పులు రూ.13 లక్షలు కోట్లు మేర ఉన్నాయని.. రాబోయే టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏవిధంగా అప్పులు తీర్చి ప్రజలపై భారం పడకూడదనే అంశంపై టీడీపీ, జనసేన నేతలు చర్చిస్తున్నారని యనమల అన్నారు. ప్రభుత్వంలో సీఎం జగన్ 48 నెలల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. యువతకు ఉపాధి లేకపోవడం, అప్పుల కారణంగా రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని యనమల ఆరోపించారు. వీటన్నింటికి అధిగమించి రేపు రాబోయే రోజుల్లో ఉమ్మడి ప్రభుత్వం 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించడం, ఉపాధి పొందేలా ఆర్థిక సహాయం అందించడం వంటి పథకాలు అమలు చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏటా రూ.లక్ష కోట్ల మేర అప్పులు చేస్తోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఖర్చులు, అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని యనమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో మండపేట, పెద్దాపురం ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, పార్లమెంట్ ఇన్‌చార్జిలు హరీష్ మాధుర్ బాలయోగి, జ్యోతులు నవీన్, మాజీ మంత్రులు చిక్కాల రామచంద్రరావు, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, దాట్ల బుచ్చిబాబు, అయితాబత్తులు ఆనందరావు, వనమాడి కొండబాబు, చిల్లా జగదీశ్వరి, చెల్లి వివేకానంద, మాజీ ఎమ్మెల్సీలు రెడ్డి సుబ్రహ్మణ్యం, వీవీవీ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి, రెడ్డి ప్రసాద్, జనసేన నాయకులు వేగుళ్ల లీలాకృష్ణ, పితాని బాలకృష్ణ, శెట్టిబత్తులు రాజబాబు పాల్గొన్నారు.


కీమోథెరపీ వార్డుని పరిశీలిస్తున్న డాక్టర్ లావణ్యకుమారి

కేన్సర్ రోగులకు నాణ్యమైన వైద్య సేవలకు చర్యలు

- జీజీహెచ్‌లో 19న 'నవ్య' డెస్క్ ప్రారంభం
- కేన్సర్ వైద్య సేవల కోసం ప్రత్యేక కృషి

జీజీహెచ్(కాకినాడ), జనవరి12: కాకినాడ జీజీహెచ్‌లో కేన్సర్ రోగులకు నాణ్యమైన వైద్య చికిత్సలు అందించేందుకు వైద్యాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జీజీహెచ్‌లో కేన్సర్ రోగులకోసం ప్రత్యేక వార్డు ఉంది. ఇక్కడ అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్ నేతృత్వంలో నిష్ణాతులైన వైద్యనిపుణులు రోగులకు వైద్యసేవలందిస్తున్నారు. కేన్సర్‌తో బాధపడేవారికి రేడియేషన్, కీమోథెరపీ అందిస్తున్నారు. రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు టాటా మెమోరియల్ కాన్సర్ ఆస్పత్రి భాగస్వామ్యంతో 'నవ్య' ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కేన్సర్‌వార్డులోనే నవ్య డెస్క్ ఏర్పాటు చేస్తారు. రోగుల సమగ్ర సమాచారం సేకరించి ఇందులో సమాచారం పొందుపరుస్తారు. రోగుల అనారోగ్య రుగ్మతలను నవ్య ద్వారా కేంద్ర, రాష్ట్రాలు, టాటా మెమోరియల్ ఆసుపత్రిలో ఉన్న నిష్ణాతులైన వైద్యుల సలహాలు, సంప్రదింపులు జరిపి నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నవ్యను ఈనెల 19న ప్రారంభించేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం కేన్సర్ విభాగంలో పర్యటించి రోగుల వివరాలు, రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలు, మందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నవ్య ప్రారంభోత్సవానికి టాటా మెమోరియల్ కాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహాన్‌శెట్టి, డీఎంఈ డాక్టర్ నరసింహంతో సహా పలువురు ప్రముఖ వైద్యులు విచ్చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ట్రాన్స్‌జెండర్లకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు వీలుగా ప్రస్తుతం జీజీహెచ్‌లో ఉన్న టీజీ హెల్ప్‌డెస్క్‌కు అదనంగా 14వ నెంబర్ వార్డు సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ రాహుల్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రదీప్, నరసింహులు పాల్గొన్నారు.

23 మద్యం సీసాలతో ఇద్దరు అరెస్టు

ప్రత్తిపాడు, జనవరి 12: కాకినాడ జిల్లా ఏలేశ్వరం, శంఖవరం మండలాల్లో 23 మద్యం సీసాలతో ఇద్దరి వ్యక్తులను ప్రత్తిపాడు సెబ్ అధికారులు అరెస్టు చేశారు. ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలో ముద్దాడ నాగేశ్వరరావును అరెస్టు చేసి అతని వద్ద 10 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నారు. శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామంలో బత్తుల ఏసుబాబును మరో 13 మద్యం సీసాలతో అరెస్టు చేశారు. ఏలేశ్వరం గ్రామంలో 20లీటర్ల సారాతో జి.గంగలను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ బి.శ్రీనివాసరావు, సిబ్బంది వెంకన్నదొర, కృష్ణార్జున, రాజు, దొరబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.


హైస్కూళ్లకు మెటీరియల్స్ అందిస్తున్న పెన్మెత్స నరసింహరాజు

రూ.5 లక్షలతో స్కూళ్లకు మెటీరియల్ అందజేత

అంతర్వేది, జనవరి 12: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలో ఉన్న 15 హైస్కూళ్లకు ఎంఈవో కార్యాలయంలో దాత పెన్మెత్స నరసింహరాజు రూ.5.06 లక్షల విలువైన మెటీరియల్‌ను అందించారు. ఎలక్సర్ మెట్‌ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్)కు సంబంధించి దివంగత నేత మాజీ ఎమ్మెల్యే అల్లూరి కృష్ణంరాజు అల్లుడు నరసింహరాజు పాఠశాలలకు ఇన్వెర్టర్లు, సౌండ్‌సిస్టమ్, సీసీ కెమెరాలు, ప్రింటర్లు బహూకరించినట్టు ఎంఈవోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు డి.కిశోర్, ఎం.వెంకటేశ్వరరావు, గెజిటెడ్ హెచ్ఎంలు ఎస్.సత్యనారాయణ, కోలా వీరాస్వామి, కనకలింగేశ్వరరావు, జగదీప్, శ్రీనివాస్, సత్యనారాయణ, సుజాత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దాతకు చిత్రం పటం అందజేస్తున్న దృశ్యం

అన్నదాన ట్రస్టుకు రూ.2.21లక్షల విరాళం

ఐ.పోలవరం, జనవరి 12: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు భీమవరం నివాసి ఇందుకూరి రామకోటేశ్వరరాజు రూ.2,21,200 విరాళం సమర్పించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. తొలుత దాతకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శనం కల్పించారు. ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందించి సత్కరించారు.

ఏజెన్సీ సమాచారం

ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం : వంతల


అంగన్‌వాడీలకు సంఘీభావం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

చింతూరు, జనవరి 12 : వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. చింతూరు ఐటీడీఏ ముందు తమ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ కార్మికులు చేపట్టిన దీక్ష శుక్రవారంనాటికి 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్ష శిబిరం వద్దకు వచ్చిన రాజేశ్వరి అంగన్ వాడీలతో మాట్లాడి వారి సమ్మెకు సంఘీభావం తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి, నాయుకులు మల్లెల వెంకటేశ్వరరావు, ఎండి జహంగీర్, పొదిలి రామారావు, ఫిరోజ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పట్ల నిర్లక్ష్యం తగదు

కూనవరం, జనవరి 12: అంగన్‌వాడీలు చేసే న్యాయపరమైన పోరాటానికి జగన్ తలొగ్గకపోతే జగన్‌పతనం తప్పదని సీపీఎం సీనియర్ నాయకులు యర్రంశెట్టి శ్రీనివాస్ అన్నారు. జగన్ అంగన్‌వాడీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారి సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి వెంకట్ సిపిఎం మండల కార్యదర్శి సీతారామయ్య, తాళ్ళూరు శ్రీనుతదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీల భోగి మంటలతో నిరసన


దీక్షా శిబిరం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌బాడీలు

రాజవొమ్మంగి జనవరి 12: మండలంలో అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరింది. శిబిరం వద్ద ముందస్తుగా భోగి మంటలు వేసి సంప్రదాయ నృత్యాలు చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు చిన్ని కుమారి, కె.వెంకటలక్ష్మి, సీఐటియూ నాయకులు పి.రామరాజు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నృత్యాలు చేశారు.

ఫుట్‌బాల్ విజేత చింతూరు

చింతూరు, జనవరి 12: అంతరాష్ట్ర ఫుట్‌బాల్ విజేతగా అల్లూరి జిల్లా చింతూరు జట్టు నిలిచింది. అంతరాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ గురు, శుక్రవారాలు రెండు రోజులపాటు చింతూరులో పోటీలు నిర్వహించింది. పోటీల్లో మన రాష్ట్రంతోపాటు సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన జట్టు పాల్గొని తలపడ్డాయి. ఈ పోటీల్లో చింతూరు జట్టు విన్నర్సు గాను తెలంగాణలోని డోర్నకల్‌కు చెందిన జట్టు రన్నర్స్ గా నిలిచాయి. విజేతలకు బహుమతులను, కప్‌లను చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అందజేశారు. కార్యక్రమంలో అసోసి యేషన్ జిల్లా కార్యదర్శి పూనెం కిరణ్‌కుమార్, ట్రెజరర్ ఎడమ అర్జున్, ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గాంధీబాబు, జడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, టీడీపీ మాజీ అధ్యక్షుడు ఎండీ జహంగీర్ పాల్గొన్నారు.

కొత్తపల్లి గీత ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కొత్తపల్లి గీత

రంపచోడవరం, జనవరి 12 : సంక్రాంతి పండగ పురస్కరించుకుని అరకు మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు కొత్తపల్లి గీత ఆధ్వర్యంలో రంపచోడవరంలో క్రికెట్ టోర్నమెంట్ పది రోజులపాటు నిర్వహించారు. టోర్నీలో మొత్తం 22 టీమ్‌లు పాల్గొనగా విన్నర్ టీంకు రూ.20 వేలు, రన్నర్ టీంకు రూ.15 వేలు, బెస్ట్ బౌలర్‌కి రూ.5 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కి రూ.5 వేలు ప్రైజ్‌మనీ ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టోర్నీ నిర్వహించడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ఈక బుల్లికొండలుదొర, గిరిజన మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బీవీ భారతి, జిల్లా ప్రధాన కార్యదర్శి చోళ్ల బొజ్జిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నరమల శ్రీను పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

చింతూరు, జనవరి 12 : ఏరియా ఆసుపత్రికి వచ్చిన ప్రతి వ్యాధిగ్రస్తునికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య పేర్కొన్నారు. శుక్రవారం పీవో చింతూరు ఏరియా ఆసుపత్రి లో తనఖీలు చేపట్టారు. వైద్యుల హాజరు, రోజు వారి వ్యాధిగ్రస్థుల వివరాలు, పరీక్ష కేంద్రాలను తనఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా. పుల్లయ్య పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

రంపచోడవరం, జనవరి 12: సంక్రాంతి సంబరాలు పురస్కరించుకొని శుక్రవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ముఖ్య అతిధులుగా పాల్గొని పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి సంకురు హేమరత్నమణి, రెండో బహుమతి కె.సునీత, మూడో బహుమతి నిహారికకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌డీఏఫ్‌సీ క్లష్టర్ హెడ్ సూర్య, బ్రాంచ్ మేనేజర్ తీగల మురళీమోహన్, టీపీఓ.రాంబాబు, హౌసింగ్ డీఈఈ రామచంద్రమూర్తి, జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

రాజవొమ్మంగి జనవరి 12: మండలంలోని శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించా రు. ప్రభుత్వ కార్యాలయంలో అధికారులు స్వామీ వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఉన్న వివేకానందుని విగ్రహానికి తహశీల్దార్ వై.వి. సుబ్రహ్మణ్యాచార్యులు పూలమాలలు వేశారు.

వివేకానందతో యువతకు ఎంతో అనుబంధం

● నన్నయ ఉపకులపతి పద్మరాజు


వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నన్నయ వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, జనవరి 12: స్వామీ వివేకానందునికి యువతతో ఎంతో అనుబంధం ఉందని. అందుకే ఆయన జయంతిని యువతకు అంకితం ఇచ్చారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం స్వామీవివేకానంద జయంతి కార్యక్రమాలకు వీసీ హాజరై వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ ఈసీ సభ్యులు గంధం నారాయణరావు, ఆచార్య పి.సురేష్‌వర్మ, పి.విజయ నిర్మల, కె.నూకరత్నం, కార్యక్రమ కోఆర్డినేటర్ ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి వివేకానందుడు

రాజమహేంద్రవరం అర్బన్: యువతకు స్ఫూర్తి వివేకానందుడు అని రాజమహేంద్రి మహిళా విద్యాసంస్థల ఛైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం కంబాలచెరువు పార్కు సమీపంలోని వివేకానందుని విగ్రహానికి కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్యసౌందర్యతో కలసి విశ్వేశ్వరరెడ్డి నివాళులర్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 పీవోలు ఎంకేఎస్ ప్రసాద్, కె.సుధారాణి, శ్రీను, వలంటీర్లు పాల్గొన్నారు. బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో వివేకానందుని విగ్రహానికి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు నివాళులర్పించారు.

భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన వివేకానందుడు

అనపర్తి: భారతదేశ సంస్కృతిని సంప్రదాయాలను, ఆధ్యాత్మిక తనువు ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానందుడని ఆ యన జన్మదినాన్ని జాతీయ యువజనోత్సవంగా జరుపుకోవడం అభినంద నీయమని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి టీడీపీ కార్యాలయంలో స్వామిచిత్రపటానికి పూలమాలవేసి నివాళు ర్పించారు.

స్వామి వివేకానందుని జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శం

స్వామి వివేకానందుని జీవితం ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన చూపిన బాట యువతకు మార్గదర్శకం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ యువజనోత్సవం సందర్భంగా అనపర్తి జీబీఆర్ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇటీవల ఆగకుండా 160 కిలోమీటర్లు పరుగును సాధించి రికార్డు సృష్టించిన క్రీడాకారుడు ఉందుర్తి రమేష్‌కు ప్రభుత్వం ద్వారా రూ.10లక్షల చెక్కును అందజేసి సత్కరించారు. ఇటీవల డాక్టరేట్ సాధించిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌పి అబ్బాయిరెడ్డిని, స్టేట్‌బెస్ట్ సిటిజన్ అవార్డు అందుకున్న శ్రీరామకృష్ణ సేవాసమితి ప్రతినిధి తాడి చంద్రశేఖరరెడ్డిని ఎమ్మెల్యే సత్కరించారు. రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, తేతల ఉపేంద్రరెడ్డి, పిఆర్ఎల్ స్వామి, తేతల త్రినాదరెడ్డి, డివిఆర్ఏ పాపిరెడ్డి, ఎం.దుర్గాప్రసాద్, ఎస్ఆర్ఆర్ రాము, సబ్బెళ్ల వెంకట రామారెడ్డి, నల్లమిల్లి సాయిరామారెడ్డి, మేడపాటి చెల్లారెడ్డి, మహేంద్ర పాల్గొన్నారు.

వివేకానందుడు స్ఫూర్తి నేటి యువతకు అవసరం

కడియం: వివేకానందుని స్ఫూర్తి నేటియువతకు చాలా అవసరమని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి కళాసేవాసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తమ్మిశెట్టి ప్రసాద్, కొప్పిశెట్టి చంటి, దంగుడుబియ్యం సత్యనారాయణ, చిక్కాల ఈశ్వరరావులు మాట్లాడారు. అన్నెం దొరబాబు, కె.రవి, బొర్రా రామకృష్ణ, పుల్లయ్య శీలం సుబ్బారావు, వివేకానంద సమితి సభ్యులు కొత్తూరి కృష్ణ, గారపాటి తాతబ్బాయి, పాల్గొన్నారు.

● వేమగిరి బుద్దవిహార్‌లో మహోదయ యాజరా ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జూదాల కట్టడి పక్కా: ఎస్పీ జగదీశ్

● త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు, గుండాట, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే జైలు తప్పదని ఎస్పీ జగదీశ్ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు, పరిసరాలు, హెల్ప్‌డెస్క్, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ స్థితిగతులు, కేసుల పరిస్థితి తదితర అంశాలను ఆయనకు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వ కంగా మాట్లాడాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. దర్యాప్తులో ఉన్న కేసుల్లో సమగ్ర విచారణ చేసి గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా త్వరగా నేర నిరూపణ జరిగే విధంగా కృషి చేయాలన్నారు. పెండింగ్‌లోని కేసులను వేగంగా పరిష్కరించాలన్నారు. ఎన్‌డీపీఎస్, పోక్సో/ అత్యాచారం తదితర తీవ్ర నేరాల కేసుల్లో దర్యాప్తు త్వరగా పూర్తిచేసి చార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. గంజాయి, సారాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌటీషీ టర్లు, బ్లేడ్‌బ్యాచ్, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వాళ్లు, పాత నేరస్తులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేసి వాళ్లలో మార్పు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. రాత్రివేళల్లో గస్తీ పెంచి చోరీలు జరగకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ముందస్తు సమాచారాన్ని సేకరించడం ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎస్పీ విజయ్‌పాల్‌ని ఆదేశించారు. ఎస్ఐలు టీఎస్‌వీఎస్ శ్యాంసుందర్, వి.అప్పలరాజు, కె.రామకృష్ణ, ఆర్.శివాజీ పాల్గొన్నారు.

మాకొద్దు మోసాల జగన్ మామా

● యువత నిరసన ప్రదర్శన


దేవీచౌక్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న ఆదిరెడ్డి, అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12: రాజమహేంద్రవరం దేవిచౌక్ సెంటర్‌లో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో మాకొద్దు మోసాల జగన్ మామా అంటూ యువత ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేసారు. దీనికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువత లక్షలాది మందికి ఉద్యోగాలు ఇస్తామని జగన్ నమ్మించి మోసం చేశాడన్నారు. అధికారంలోకి రాగానే 2.80 లక్షల ఉద్యోగాలు భర్తీ, ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్భాలు పలికిన జగన్ నిరుద్యోగులను నిలువునా మోసం చేశాడని మండిపడ్డారు. నాలుగేళ్ల పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో సీఎం సమాధానం చెప్పాలని, దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, రెడ్డిమణి, ఎం.రాంబాబు, చాపల చిన్నరాజు, అహ్మద్, బషీర్, మహబూబ్ ఖాన్, కంటిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైసీపీకి రాజీనామా చేశాం : ఆకుమర్తి

రాజమహేంద్రవరంరూరల్ జనవరి12: మా మాదిగల గొంతు నొక్కుతున్న వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆకుమర్తి చిన్నా మాదిగ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ప్రకటించారు. ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో జగన్మోహన్‌రెడ్డిని కలిసినపుడు మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి నిధులు కేటాయిస్తామని, మాదిగలకు కావలసిన ప్రత్యేక భవనాలు, లిడ్‌క్యాప్ నిధులు, సమానపదవులు, కల్పిస్తామన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత మాదిగలను మోసం చేశారన్నారు.

టీడీపీకి అండగా ఉంటాం

● జయహో బీసీ సదస్సులో బీసీ నేతల ప్రకటన


ఐక్యత చాటుతున్న బీసీ నాయకులతో బీవీఆర్ చౌదరి

కోరుకొండ, జనవరి12: రాష్ట్రంలో 56శాతానికి పైగా 150 బీసీ కులాలు రానున్న ఎన్నికల్లో టీడీపీకి అండగా ఉంటామని రాజానగరం నియోజకవర్గం నుంచి బొడ్డు వెంకటరమణ చౌదరిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ప్రకటించారు. కోరుకొండ మండలంలోని బూరుగుపూడి గేటు వద్ద శుక్రవారం సాయంత్రం టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల సంక్షేమం కోసం పాటు పడిందని గతాన్ని గుర్తు చేసుకున్నారు. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొడ్డు వెంకటరమణచౌదరి మాట్లాడుతూ ఎన్నికలకు సంసిద్ధం కావాలని, ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించేది సమాజంలో 56 శాతం ఉన్న బీసీలదేనన్నారు. సమావేశంలో బీసీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, రొంగల శ్రీనివాసు,మాతాసీ తారాముడు, పితాని శివరామకృష్ణ, షేక్‌సుభాన్, కుడిపూడి సత్తిబాబు, మజ్జి పద్మావతి, చెల్లుబోయిన శ్రీనివాస్, నూని వెంకన్న, మల్లిబాబు, దూది కాంతారావు తదితరులు ప్రసంగించారు. అడపా వీరబాబు, కంటే నాగేశ్వరావు, మింగిలక్ష్మినారాయణ, 22 గ్రామాలకు చెందిన బీసీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠినచర్యలు: సీఐ

రాజానగరం, జనవరి 12: సంక్రాంతిని పురస్కరించుకుని సాంప్రదాయ క్రీడల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రాజానగరం సీ.ఐ పి.కాశీవిశ్వనాథ్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ క్రీడల పేరుతో పేకాట, కోడి పందేలు, అశ్లీల నృత్యాలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గత రెండు రోజులుగా నామవరం, పాతతుంగపాడు గ్రామాల్లో పర్యటించి కోడికత్తులు తయారు చేస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని, నిందితుల నుంచి 300 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా సంతకాల సేకరణ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 12: అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా శుక్రవారం గోకవరం బస్టాండు సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫ్లెక్స్‌పై ప్రజల నుంచి సంతకాల సేకరణ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, యూటీఎఫ్ నాయకుడు రూపస్‌రావు, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్ తదితరులు ఈ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కాగా, అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 32 వ రోజుకు చేరింది. సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్షాశిబిరంలో గోపాలపురం ప్రాజెక్టు అంగన్వాడీలు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని యూటీఎఫ్ నాయకురాలు విజయగౌరి, జిల్లా కార్యదర్శి రవిబాబు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి ప్రారంభించారు.

నర్సరీ రైతులకు సహాయ సహకారాలు అందిస్తా

● నర్సరీ రైతులతో ముఖాముఖి నిర్వహించిన మంత్రి వేణుగోపాలకృష్ణ

కడియం, జనవరి 12: నర్సరీ రైతులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం నర్సరీ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో మంత్రి నర్సరీ రైతులతో ముఖాముఖి ఏర్పాటుచేశారు. నర్సరీసంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, వైసీపీ నాయకులు గిరజాల బాబు, యాదల స్టాలిన్, తాడాల చక్రవర్తి, కొత్తపల్లి శివాజీ పలువురు నర్సరీ రైతులు నర్సరీరంగంలో నెలకొన్న సమస్యలను మంత్రి వేణుగోపాలకృష్ణకు వివరించారు. నర్సరీలకు మట్టి రవాణాపై లారీకి రూ. 2వేలు అదనంగా మైనింగ్ సెస్సు వసూలు చేస్తున్నారని, నర్సరీలకు మీటర్లు బిగిస్తున్నారని, రహదారుల విస్తరణ పటిష్టం చేయాలని కోరారు. అలానే గంజాయి స్మగర్లు మొక్కల లారీలను అక్రమ గంజాయి రవాణాకు మార్గంగా ఎంచుకున్నారని దీనివలన నర్సరీ రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిని అరికట్టాలని మంత్రి వేణుగోపాలకృష్ణను కోరారు. వీటిపై స్పందించిన మంత్రి రాష్ట్ర డీజీపీతో మాట్లాడి జీపీఎస్ విధానం ద్వారా మొక్కల లారీలపై నిరంతర పర్యవేక్షణ పెంచుతామన్నారు. దొంతంశెట్టి వీరభద్రయ్య, తిరుమలశెట్టి శ్రీను, వెలుగుబంటి అచ్యుతరామ్, సాపిరెడ్డి సూరిబాబు, శైలజ, ఈలి గోపాలం, కట్టా జమిందార్, నర్సరీపాలక వర్గ సభ్యులు నర్సరీ రైతులు పాల్గొన్నారు.

జనసేన అధినేత పవన్‌ను కలిసిన నర్సరీసంఘం అధ్యక్షుడు



కడియం, జనవరి 12: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను మంగళగిరిలో కడియం సర్‌ఆర్థర్‌కాటన్ నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. కడియం నర్సరీలను సందర్శించాలని కోరారు. పవన్‌కళ్యాణ్‌ను కలిసిన వారిలో శివదుర్గా నర్సరీ అధినేత మల్లు శివన్నారారాయణ, మల్లు పోలరాజుకు చెందిన శివాంజనేయ నర్సరీ సిబ్బంది ఉన్నారు.

పోటాపోటీగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

రాజానగరం, జనవరి 12: తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలను పునికి పుచ్చుకునే సంక్రాంతి రంగ వల్లులు ప్రస్తుతం రాజకీయ రంగులు అద్దుకుంటున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజానగరం నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో సైతం జనసేన, వైసీపీల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు పోటాపోటీగా నిర్వహిస్తున్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలైన వారికి జనసేన పార్టీ ప్రథమ బహుమతిగా 8 గ్రాములు, ద్వితీయ బహుమతిగా 5 గ్రాములు, తృతీయ బహుమతిగా 3 గ్రాముల బంగారాన్ని ప్రకటించారు. అధికారపార్టీ వైసీపీ నిర్వహించే ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిగా వాషింగ్‌మెషీన్, ద్వితీయ బహుమతిగా మిక్సీలు, తృతీయ బహుమతిగా డిన్నర్ సెట్లు అందిస్తున్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ విలువైన బహుమతులను కట్టబెడుతూ మహిళలను యువతీ, యువకులను ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు. ప్రధానంగా జగనన్న, పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే రాజా, బత్తుల బలరామకృష్ణ ఫోటోలతో కూడిన ముగ్గులను వేశారు.

గ్రామాల్లో 144 సెక్షన్ అమలు

రాజానగరం, జనవరి 12 : సంక్రాంతి పండగ సందర్భంగా సుప్రీం కోర్టు, కలెక్టర్ వారి ఆదేశాల ప్రకారం గ్రామాల్లో ఈనెల 25వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని రాజానగరం తహసీల్దార్ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, జూదం, పేకాట, గుండాట తదితర అసాంఘిక కార్యకాలాపాలను నిషేధించామన్నారు. ఐదుగురు కంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడి నిషేధిత కార్యక్రమాలు నిర్వహించి నా, అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటా మన్నారు.

ఎంపీ సహా ఏడు నియోజకవర్గాల్లో బీసీలకు సీట్లు ఇవ్వాలి

● బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సానబోయిన


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సానబోయిన రామారావు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12: రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానంతో పాటు ఉభయగోదావరి జిల్లాల్లో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీసీలకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సానబోయిన రామారావు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం హోటల్ అనుపమలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడఅర్బన్, రూరల్, కొత్తపేట, తణుకు, ఆచంట, పాలకొల్లు, ఉండి నియోజకవర్గాల ఎమ్మెల్యే సీట్లను బీసీలకు కేటాయించాలని, ఆ మేరకు ప్రాధాన్యమిచ్చిన రాజకీయపార్టీలకు బీసీ సంఘం మద్దతు ఇస్తుందన్నారు. 13 డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని, అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కార్డులను అనుమతించాలని లేదా ప్రభుత్వాసుపత్రిలోనే పూర్తిస్థాయిలో మందులు, అత్యాధునిక వైద్యపరికరాలు, శస్త్ర చికిత్సలు, ఇతర సదుపాయాలు కల్పించాలని, సింగిల్ టీచర్లు ఉన్న పదివేల స్కూళ్లను ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న స్కూల్స్‌గా మార్చాలని, పోలీస్ రిక్రూమెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు ఉప్పిడి గంగాధర్, బత్తిన ఏడుకొండలు, గోర్స తాతబ్బాయియాదవ్, గుత్తుల సుబ్రహ్మణ్యం, ఏలూరు చిన్న, కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ త్వరగా పూర్తిచేయాలి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12: రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఒప్పంద అధ్యాపక సంఘం జేఏసీ నాయకుడు వీరబాబు శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ మేరకు అధికారులు అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఇందులో ఎటువంటి అక్రమాలకు తావుండదని స్పష్టం చేశారు.

భూహక్కు చట్టం రద్దు చేయాలి

● రాజమండ్రి బార్ అసోసియేషన్



సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీయూబి రాజు, బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ముప్పాళ్ళ సుబ్బారావు డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన భూహక్కు చట్టంతో రెవెన్యూ అధికారులకు కోర్టు పరిధి దాటి అధికారాలు అప్పగిస్తున్నారని, ఇది సరికాదన్నారు. ఈ చట్టాన్ని సవరించి కోర్టు పరిధిలోకి తీసుకురావాలన్నారు. లేకుంటే బాధితులకు న్యాయం జరగదన్నారు. కేరళ, పశ్చిమబెంగాల్, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలు ఈ చట్టం వల్ల ప్రజలకు ఇబ్బందుల కలుగుతాయని అమలు చేయలేదన్నారు. కాని ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో న్యాయవాదులు, ప్రముఖులు, మేధావులతో చర్చించకుండా అమలు చేస్తోందన్నారు. ప్రజల ఆస్తిపై వారి హక్కులేకుండా రెవెన్యూ అధికారులకు అధికారాలు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి హనుమంతరావు, గేద ల వెంకటేశ్వరరావు, తవ్వల వీరేంద్రనాద్, అంబటి మురళీకృష్ణ, సురపురెడ్డి తాతారావు, ఎన్‌వీఆర్‌వీఎస్ ధర్మరావు, నరాల రమణమూర్తి పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీలో ఎస్‌కేవీటీ విద్యార్థికి గోల్డ్‌మెడల్


మోహన్‌రావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 12: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఉభయగోదావరి జిల్లాల క్రాస్ కంట్రీలో రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెకండ్ బీఏ విద్యార్థి బి.మోహన్‌రావు బంగారు పతకం సాధించారు. తమ కళాశాల విద్యార్థికి బంగారు పతకం రావడం సంతోషదాయకమని కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు తెలిపారు. అలాగే ఫిబ్రవరి 10, 11 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ క్రాస్ కంట్రీకి కూడా అర్హత సాధించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌రావును స్పోర్ట్స్ విభాగాధిపతి వీఏ కిషోర్‌బాబు, గాలి వెంకటరమణ, వీవీబీ సంజీవరావు, శరత్‌బాబు అభినందించారు.

రాజమహేంద్రవరంలో టెన్నిస్ పోటీలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12: రాజమహేంద్రవరంలో సంక్రాంతి సందర్భంగా రాజమండ్రి టెన్నిస్ క్లబ్ కోచ్ ప్రకాష్ ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముళ్ళ మాధవ్ అన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో జరిగిన పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పోటీల్లో విజేతలుగా అండర్-10 విభాగంలో పార్థి, యువన్, అండర్-12లో శ్రీకర్, లక్షిత్, లాస్య, అండర్-14లో షేక్ ఫైజల్, సన్నీ, గీతిక, స్వాతి, రన్నరప్‌గా పార్థు, మానస, కార్తికేయలు నిలిచారు. వారికి బహుతులను మాదవ్ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ జునుపే రాజు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్, చార్టెడ్ అకౌంటెంట్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై దర్శనమిచ్చిన శ్రీనివాసుడు


సింహ వాహనంలో ఊరేగుతున్న శ్రీనివాసుడు

బిక్కవోలు, జనవరి 12: తూర్పు తిరుమలగా పేరొందిన బలభద్రపురంలో నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఎనిమిదో రోజుకు చేరాయి. ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవవిగ్రహాలకు శ్రీమాన్ వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో సుగంధ పుష్పాభిషేకం, అష్టలక్ష్మీ యాగం నిర్వహించారు. ఈసందర్భంగా 250 తామరపూలతో స్వామి, అమ్మవార్లకు పుష్పాభిషేకం జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను కొవ్వూరి సతీష్‌రెడ్డి, శ్రీదేవి దంపతులు తయారు చేయించిన సింహవాహనంపై ఉంచి గ్రామ పురవీధులలో ఊరేగించారు. అనంతరం ప్రత్యేక ఉత్సవం, బ్రహ్మోత్సవం, ద్వాదశ ప్రదిక్షణాలతో కార్యక్రమాలు ముగించారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోడానికి వచ్చిన భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేసినట్లు ఆలయవ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో జాతీయ యువదినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 12: వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జాతీయ యువ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ రామచంద్రరావు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు స్వామి వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని మనస్సులో గట్టిగా నిర్ణయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు, కేడెట్లు, వలంటీర్లు, రెడ్‌క్రాస్ అధికారులు పాల్గొన్నారు.



పాఠశాలల్లో పనులు పూర్తవ్వాలి : డీఈవో

రాజమహేంద్రవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలల్లోని పనులు యుద్ధ ప్రాతిపదికన ఈ నెల 18లోగా పూర్తి కావాలని డీఈవో ఎస్.అబ్రహం ఆదేశించారు. అన్ని మండలాల ఎంఈవోలు, ఇంజనీర్లు, ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం అత్యవసరంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పనుల ప్రగతిపై నివేదిక అందజేయాలన్నారు.



కార్లలో బయలుదేరిన టీడీపీ నాయకులు

మంగళగిరికి బాపిరాజు వర్గం

8

ప్రాధాన్యత కల్పించాలని టీడీపీ ఆఫీస్‌లో వినతులు

పండగ బాదుడు!





- బస్ రూట్‌లోనే రైళ్లు
- రైళ్లను రద్దు చేసి 'ప్రత్యేక' రుద్దుడు
- సీజన్ మాటున బస్సుల బాదుడు
- పండుగ పేరిట చార్జీలు పెంపు
- 17వ తేదీ వరకు రైళ్లన్నీ ఫుల్
- బస్‌ల రిజర్వేషన్లదీ ఇదే పరిస్థితి
- ప్రైవేటు బస్సుల్లో శ్రుతి మించి ధరలు
- అరకొరగా ఆర్టీసీ సర్వీసులు
- భారంగా గోదావరి జిల్లాల ప్రయాణం

స్పెషల్ పేరిట దోపిడీ..

బాదుడే బాదుడు.. పండుగ బాదుడు.. బస్ ఎక్కి దిగితే బాదుడు.. రైలు ఎక్కి దిగితే బాదుడు.. చార్జీలు మళ్లీ పెంచలేదు కానీ... పండుగ పేరిట దోపిడీకి తెరతీశారు.. ప్రయాణికుల జేబు ఖాళీ చేస్తున్నారు. గతంలో పండుగ సమయంలో ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో మాత్రమే స్పెషల్ దోపిడీ ఉండేది.. ఆ దారిలో రైల్వే శాఖ నడుస్తోంది. దీంతో ప్రయాణికులు ఎక్కడికక్కడ ఇదేం బాదుడురా బాబూ అంటూ తలలు పట్టుకుంటున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతికి ఊరెళదామన్నా బాదుడే బాదుడు.. ఒకరు 'ప్రత్యేకం'గా బాదేస్తుంటే.. మరొకరు సీజన్ మాటున రుద్దేస్తున్నారు. ఏదేమైనా పెద్ద పండుగ పేరుతో జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేసే పాలకులు మాత్రం కానరావడం లేదు.పెద్ద పండుగకు హైదరాబాద్ నుంచి ఎక్కువగా గోదావరి జిల్లాలకు రాకపోకలు సాగుతాయి. ఈ నేపథ్యంలో స్పెషల్ రైళ్లంటూ రైల్వే, ప్రత్యేక బస్సులంటూ ఆర్టీసీ, సీజనంటూ ప్రైవేటు ట్రావెల్స్.ఇలా ఎవరి మార్గంలో వారు అవసరాన్ని ఆసరాగా చేసుకొని అదనపు ఆదాయాన్ని గల్లాపెట్టెల్లో వేసుకుంటున్నారు. డీజిల్ ధర పెరిగినందున బస్సుల చార్జీలు.. విద్యుత్ ధరలు పెరిగాయని రైల్వే టికెట్ ధరలు పెంచితే మన అసహనానికి కాస్త సర్దిచెప్పుకోవచ్చు. కానీ పండుగ పేరు చెప్పి దోపిడీకి తెరతీస్తున్నారు. అదే పట్టాలు.. అవే రైళ్లు, అదే డీజిల్ ధర.. అవే రోడ్లు.. మరి చార్జీలు ఎందుకు పెరిగాయని ఒకవేళ ఎవరైనా ప్రశ్న వేసుకుంటే.. సమాధానం మాత్రం ఒక్కటే.. అదే పండుగ ప్రయాణాలు. దీనికి సీజన్ అని ఓ పేరు పెట్టారు. సాధారణంగా ప్రజల అవసరాలకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుంది. కానీ ఆ అవసరాలను అదనపు ఆదాయానికి ఆధారంగా ఎంచుకోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. సంక్రాంతి 'స్పెషల్' దందాపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

రైల్వే 'స్పెషల్' తెలివి

రైల్వే 'స్పెషల్' తెలివితేటలకు ప్రయాణికులు మండిపడుతున్నారు.ఇటీవల పనులు/సాంకేతిక కారణాలను చూపుతూ రైళ్లను రద్దు చేయడం,దారి మళ్లించడం, పాక్షికంగా రద్దు చేయడం వంటి జిమ్మిక్కులు చేస్తున్నారు. రైలు వస్తే వచ్చినట్టు లేకపోతే లేనట్టు అనే స్థాయికి పరిస్థితి దిగజారింది. అయితే రెగ్యులర్ రైళ్లను రద్దు చేస్తూ ప్రత్యేక రైళ్లను వేస్తున్నారు.అవే పట్టాలు, అదే దారి.. ప్రత్యేకత ఏమిటో తెలియక ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు.ప్రత్యేక రైళ్లు వేయడానికి ర్యాక్ (బోగీ)ల కొరత ఉందంటూ రైల్వే దాటవేత ధోరణి అవలంభిస్తోంది. అయితే రద్దు చేసిన రైళ్ల బోగీలు ఏమి చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఉంది. రద్దు చేస్తున్న రైళ్ల బోగీలకు ఇంజన్‌ని తగిలించి ప్రత్యేకం పేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారంటూ ప్రయాణికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.రోజూ ప్రయాణికుల ఆదరణ ఉండే రైళ్లనూ రోజుల తరబడి దూరం చేస్తుండడంపై మండిపడుతున్నారు.

రైళ్లన్నీ ఫుల్ వెయిటింగ్..

రోజువారీ రాకపోకలు సాగించే రైళ్లలో ఇప్పటికే ఏసీలతో సహా బెర్తులన్నీ నిండిపోయాయి. సికింద్రాబాద్ నుంచి ఈ వారంలో రానుపోను కాకినాడ, శ్రీకాకుళం, విశాఖ నుంచి 8 సర్వీసులను వేశారు.గురువారం మధ్యాహ్నానికి వీటిలో కూడా ఖాళీలు లేవు. 12,13 రిజర్వేషన్లు అయిపోయాయి.ఓ స్పెషల్ ట్రైనుకు స్లీపర్ వెయిటింగ్ లిస్ట్ 340 ఉంది.గౌతమికి వెయిటింగ్ లిస్ట్ 475కి చేరడంతో రిజర్వేషన్లు ఆపేశారు. కోకనాడ ఎక్స్‌ప్రెస్ కూడా అదే పరిస్థితి. స్లీపర్,థర్డ్, సెకండ్, ఫస్ట్ ఏసీలు నో రూమ్ చూపిస్తున్నాయి. తత్కాల్‌లో దొరికితే బాగా అదృష్టమే అని చెప్పాలి. 11న సికింద్రాబాద్ నుంచి ఇటువైపునకు రాజమండ్రిలో తత్కాల్‌లో కేవలం ఒకరికి మాత్రమే టిక్కెట్ బుక్కయింది. వందేభారత్, గరీబ్‌రథ్, జన్మభూమి, కోణార్క్, గోదావరి, విశాఖ, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లూ నిండిపోయాయి.

జనంపై చార్జీల మోత..

రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వే ప్రత్యేక రైళ్లను వేయడం పరిపాటి. అయితే వాటిలో చార్జీల మోత మోగుతోంది. సికింద్రాబాద్ నుంచి రాజమండ్రికి గోదావరి, గౌతమి తదితర రోజువారీ సాధారణ రైళ్లలో స్లీపర్ క్లాస్ రూ.325, థర్డ్ ఏసీ రూ.835 ఉండగా ప్రత్యేక రైళ్లలో స్లీపర్ రూ.385, 405 ఉంది. థర్డ్ ఏసీ రూ.835కిగాను ప్రత్యేక రైళ్లలో రూ.1050, రూ.1120 చెల్లించాల్సి వస్తోంది. వందే భారత్ 12న వెయిటింగ్ 200 ఉండగా, 13న 234 ఉంది. ఈ రైలుకు చైర్‌కార్(సిట్టింగ్) రూ.1365, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌కి రూ.2465 టికెట్ ధర ఉంది. థర్డ్ క్లాస్ ఏసీ రైలు గరీబ్‌రథ్‌కి వెయిటింగ్ 12న టికెట్లు నిండుకోగా 13న వెయిటింగ్‌లిస్ట్ 203 కొనసాగుతోంది. ఏపీ ఎక్స్‌ప్రెస్‌ని విశాఖ నుంచి దారిమళ్లించారు. రాజమండ్రి దారిలో 10 నుంచి 14వ తేదీ వరకూ అనుమతించారు. స్వర్ణజయంతి, పూరీ-ఓకా, విశాఖ-గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్‌లు విశాఖ నుంచి అటుగా వెళ్లిపోతున్నాయి. జన్మభూమి మినహాయిస్తే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు ఏమీ లేవు. దీంతో దగ్గరి ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు సుదూరంగా ప్రయాణాలు సాగించే రైళ్లలో ఎక్కితే నరకం కనిపిస్తోంది. ఇటు నుంచి ప్రయాణికుల ఆదరణ ఉండే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను చాలా రోజుల నుంచీ ఆపేశారు. ఇప్పుడు పండుగ సందర్భంగా 10 నుంచి 14వ తేదీ వరకూ నడుపుతున్నా..తర్వాత ఫిబ్రవరి నెలాఖరు వరకూ ఈ రైలు కనబడదు. విశాఖ-విజయవాడ ఉదయ్ డబుల్ డెక్కర్,గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌లను పండుగకు నాలుగు రోజుల పాటు కనికరించారు. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు లేకపోవడంతో రద్దీ క్లియర్ కావడం లేదు. చెన్నై -సిల్చార్, గువాహటి-బెంగళూరు ఇలా సుదూర ప్రాంతాలకు ప్రయాణించే సుమారు 5 ప్రత్యేక రైళ్లను వేసిన వాటి లో స్లీపర్ బోగీల్లో కాలు పెట్టలేని పరిస్థితుల్లో నడుస్తున్నాయి.

బస్సుల్లోనూ బాదుడు..

పండుగ వచ్చిందంటే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులకు లాభాల పండుగ వచ్చినట్లే. సాధారణ రోజులకంటే వందా రెండొందల శాతం ధరలు అమాంతం పెంచేస్తారు. సికింద్రాబాద్ నుంచి రాజమండ్రి, కాకినాడకు సాధారణ రోజుల్లో రూ.800-రూ.1200 ఉంటే ఇప్పుడు కనీసం రూ.2వేలు చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇక స్లీపర్, సూపర్, అల్ట్రా ఇలా.. వివిధ రకాల పేర్లు పెట్టి సదుపాయాల మాటున విపరీతంగా ధరలు నిర్ణయిస్తున్నారు. రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ పెరగడంతో బస్సులు తప్ప ప్రయాణికులకు రెండో ఆప్షన్ లేదు. ఇదే అదనుగా అదనంగా పిండేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఆర్టీసీ కూడా మాట రాకుండా ఉండేందుకు అరకొర ప్రత్యేక సర్వీసులను వేస్తూ చేతులు దులుపుకుంటోందనే విమర్శలున్నాయి. రద్దీ అధికంగా ఉన్నా ఆ మేరకు సర్వీసులు లేకపోవడంతో సికింద్రాబాద్‌లోని ఎంజీబీఎస్, ఈసీఐఎల్, కూకట్‌పల్లి, అమీర్‌పేట, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో బస్సు పాయింట్లు గోదావరి జిల్లాలకు పండుగకు రావాల్సిన ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఆన్‌లైన్‌లో టికెట్లు తీసుకోని ప్రయాణికుల వద్ద నుంచి ప్రైవేటు ట్రావెల్స్ వాళ్లు ఇష్టానుసారం ధరలు బాదేస్తున్నారని జనం గగ్గోలు పెడుతున్నారు. ఇక ఏదైనా కారు కిరాయికి మాట్లాడుకున్నా రూ.30వేలపైనే డిమాండు చేస్తున్నారని చెబుతున్నారు. పండుగ ప్రయాణానికి ఇన్ని తిప్పలు పడుతున్నా యంత్రాంగం మిన్నకుండడంపై ప్రయాణికులు తీవ్రంగా మండిపడుతున్నారు. అవసరానికి అక్కరకు రాని సదుపాయాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

జనరల్ బోగీలా రిజర్వేషన్ బోగి



మంగుళూరులో ఉద్యోగం చేస్తున్నా.. పండక్కి రావాలని రెండు నెలల కిందటే రిజర్వేషన్ చేయించుకున్నా.. ముగ్గురు స్నేహితులం చెన్నై భువనేశ్వర్ రైలులో రాజమహేంద్రవరం బయలుదేరాం. రిజర్వేషన్ ఎందుకు చేయించుకున్నామో మాకే తెలియలేదు. ఎందుకంటే రిజర్వేషన్ బోగి జనరల్ బోగిలా మారింది. నేను నా ఇద్దరు స్నేహితులు తాడేపల్లిగూడెం నుంచి గేటు దగ్గరకు రావడానికి ప్రయత్నిస్తే రాజమండ్రిలో రైలు ఆగి బయలుదేరే సమయానికి నేనొక్కడినే అతికష్టంమీద దిగగలిగాను.నా స్నేహితులు దిగలేకపోయారు.

- దిలీప్, రాజమహేంద్రవరం

మళ్లీ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లింపు

సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు

కొవ్వూరు, జనవరి 12 : కేంద్ర ప్రభుత్వం నాలుగు రోజుల కిందట గ్రామాల అభివృద్ధికి విడుదల చేసిన రూ.988 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించాలని చూస్తుందని సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు విమర్శించారు. కొవ్వూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 12,918 గ్రామాల అభివృద్ధికి కేంద్రం 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ. 988 కోట్లు నాలుగు రోజుల కిందట విడుదల చేసినట్టు కేంద్ర ప్రభుత్వ అధికారుల నుంచి సమాచారం ఉందన్నారు. ఈ నిధులను గ్రామాల అభివృద్ధికి ఖర్చుచేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.398 కోట్లను మాత్రమే గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేసి మిగిలిన రూ. 600 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. గతంలో దారిమళ్లించిన రూ.8,629 కోట్లు, తాజాగా దారిమళ్లించిన రూ. 600 కోట్లు 4 రోజుల్లో తిరిగి గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఖాతాల్లో జమచేయాలన్నారు. లేకపోతే రాజకీయాలకతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో తాడేపల్లిలోని రాష్ట్ర పంచాయితీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

వీరుళ్లమ్మ,బాపనమ్మ సొమ్ముపై లెక్క జెప్పండి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 12 : అనపర్తి గ్రామ దేవతలు వీరుళ్లమ్మ, బాపనమ్మ అమ్మవార్ల సొమ్ముల భద్రతపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఉత్సవ కమిటీల ప్రతినిధులపై ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.అనపర్తిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అమ్మవార్ల ఆలయాలకు నిల్వ ఎంత ఉంది ఎక్కడ ఉందనే దానిపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు తమలంపూడి సుధాక రరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్, నల్లమిల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన పెంచాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం,జనవరి12(ఆంధ్రజ్యోతి) : 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని, అందులో భాగంగా పోస్టల్ బ్యాలెట్, ఆబ్సెంటీ ఓటర్ల విషయంలో కీలకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు. కలెక్టర్‌లో శుక్రవారం జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్(ఏఎల్ఎంటి) రెండో రోజు శిక్షణలో మాట్లాడారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే వ్యక్తులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పించాలన్నారు.

కన్నుపడితే కూల్చుడే!

మొన్న జీయోన్ అంధుల పాఠశాల.. నేడు చర్చి, టాక్సీస్టాండ్ కూల్చివేత



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జీయోన్ అంధ పాఠశాల విద్యార్థుల ధర్నా



జేసీబీతో చర్చి కూల్చివేత


రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12 : ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన జగన్ పరిపాలన పరంపర కొనసాగుతూనే ఉంది. సీఎం జగనే కాదు.. వైసీపీ నాయకులు అలాగే ఉన్నారు.. రాష్ట్రంలో వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధుల కన్నుపడితే కట్టడాలు కూలిపోతున్నాయి.. బాధితులు లబోదిబోమన్నా కనీసం పట్టించుకోవడంలేదు. రాజమహేంద్రవరంలో గత నాలుగు దశాబ్దాలకుపైగా అంధ విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పిన జియోన్ అంధుల పాఠశాలను పునాదులతో లేపేశారు.అంధ విద్యార్థులను మరొక పాఠశాలకు తరలించేశారు. పాఠశాలలను నిలబెట్టాల్సిన ప్రభుత్వమే కూల్చివేయడంతో దిక్కుతోచనిస్థితిలో అంధ విద్యార్థులు ఉన్నారు. ఈ సంఘటన మరువక ముందే రాజమహేంద్రవరంలో మరొక ఘటన చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం కంబాలచెరువు పార్కును ఆనుకుని హైటెక్ బస్టాండ్ పక్కనే ఉన్న క్రీస్తుసంఘం ప్రార్థనా మందిరం (చర్చి)ను శుక్రవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అధికారులు కూల్చివేశారు. ఎంపీ భరత్ రామ్ ఒత్తిడి వల్లే ఈ చర్చిని కూల్చివేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. 1983 నుంచి పోరంబోకు స్థలంలో ట్యాక్సీ స్టాండ్ ఉండేది.ఆ స్థలంలోనే గత 20 ఏళ్ళ కిందట క్రీస్తు ప్రార్థనామందిరాన్ని నిర్మించి ప్రార్థనలు చేసుకుంటున్నారు. ఈ స్థలం విషయంలో కార్పొరేషన్‌కు బాధిత క్రైస్తవులు, ట్యాక్సీస్టాండ్ నిర్వాహకులకు కోర్టులో కేసు నడుస్తుంది. ఈ నేపథ్యంలో గత నెల 26న మునిసిపాలిటికి అనుకూలంగా రాజమండ్రి 5వ కోర్టు తీర్పు ఇచ్చింది.దీంతో కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో కార్పొరేషన్ సిబ్బంది జేసీబీని తీసుకువచ్చి శుక్రవారం చర్చిని కూల్చివేశారు. ప్రార్థన జరుగుతున్న సమయం కావడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చర్చిని కూల్చడానికి వీల్లేదని ఎండీ.సుబియారాణి,పుట్టా బుజ్జమ్మ, సోమబత్తుల కాంతం ,వి.మంగ, బేబి, లక్ష్మి అడ్డుకున్నారు. కోర్టుకు అప్పీల్ చేసేందుకు సమయం ఉన్నప్పటికీ కేవలం ఎంపీ భరత్ రామ్ ఒత్తిడి వల్లనే చర్చి, ట్యాక్సీ స్టాండ్‌లను కూల్చివేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. అడ్డుకోవడానికి యత్నించిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దివ్యాంగులు, అంధులకు నీడ కల్పించాలి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 12 : రాజమండ్రి ఎంపీ భరత్‌రామ్ అంధులు, దివ్యాంగుల జీవితాలతో ఆటలాడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ సిటీ కన్వీనర్ అనుశ్రీ సత్యనారాయణ ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం జియోన్ అంధుల పాఠశాలకు చెందిన దివ్యాంగులు, అంధులైన విద్యార్థులు ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని, మెరుగైన ప్రత్యామ్నాయం చూపించాలని నిరసన చేపట్టారు. వీరికి తెలుగుదేశం, జనసేన, సీపీఐ, సీపీఎంలు, పలు దివ్యాంగుల సంక్షేమ సంఘాలు సంఘీభావం తెలిపారు. అంధులు, దివ్యాంగులపై కనీస జాలిలేకుండా ప్రతాపం చూపించి రోడ్డున పడేయడం వైసీపీ నాయకుల దుర్మార్గానికి నిదర్శనమన్నారు. జీజీహెచ్‌లోని జియోన్ పాఠశాల స్థలాన్ని ఎవరికో లీజుకు ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందుకే ఎంపీ భరత్‌రామ్ నోరు మెదపడంలేదన్నారు. ఈ స్థలాన్ని వైద్యకళాశాలకు కేటాయించారని బయటకు చేస్తున్నది కేవలం ప్రచారం మాత్రమే అన్నారు. అధికారులు, యాజమాన్యానికి ఏ గొడవలు ఉన్నాయో తమకు తెలీదని, అంధులు, దివ్యాంగ విద్యార్థులను ఇలా రోడ్డున పడేయడం చాలా అన్యాయమని, వీరికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, బుడ్డిగ రాధా, జనసేన పార్టీ నాయకులు వై.శ్రీను, తెలుగుదేశం, జనసేన, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న శేషారావు



షరీఫ్ (ఫైల్)

టీడీపీ చొరవ చూపింది.. కడసారి చూపు దక్కింది!

మలేషియా నుంచి మృతదేహాన్ని రప్పించిన తెలుగుదేశం

నిడదవోలు, జనవరి 12 : ఉపాధి నిమిత్తం మలేషియా వెళ్లిన ఒక వ్యక్తి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతిచెందగా టీడీపీ నాయకుల చొరవతో శుక్రవారం స్వగ్రామానికి చేరింది.నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి చెందిన షేక్ గాలిబ్ షరీఫ్ (45) ఐదేళ్ళ కిందట ఉపాధి నిమిత్తం మలేషియా వెళ్ళాడు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత నెల డిసెంబరు మూడో వారంలో గుండెపోటుతో మృతి చెందాడు. సుమారు 20 రోజుల తరువాత కోరు మామిడిలో కుటుంబీకులకు షరీఫ్ మృతిచెందాడని తెలిసింది. మృతదేహాన్ని ఇండియాకు పంపించేందుకు లక్షల్లో ఖర్చు అవుతుందని కుటుంబీకులకు సమాచారం వచ్చింది. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం.. దీంతో ఏం చేయాలో పాలుపోలేదు. ఏదో ఒక విధంగా తన భర్త మృతదేహాన్ని ఇండియాకు తీసుకొచ్చి కడసారి చూసుకోవాలని భార్య ప్రయత్నాలు ఆరంభించింది.ఈ విషయాన్ని టీడీపీ కార్యకర్త ఇస్మాయిల్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు దృష్టికి తీసుకువెళ్ళాడు. దీనిపై స్పందించిన శేషారావు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలోని టీడీపీ ఎన్ఆర్ఐ సెల్ కో ఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్‌తో చర్చించారు. మలేషియాలోని తెలుగు ప్రవాసితుల సంఘం ప్రతినిధులైన ఆనంద్, కిరణ్‌లను సంప్రదించి వారి సహకారంతో అక్కడ తెలుగువారి ఆర్థిక సహకారంతో షరీఫ్ మృతదేహాన్ని శుక్రవారం నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి తీసుకువచ్చారు.మృతదేహాన్ని చూసుకుని బాధిత కుటుంబీకులు బోరున విలపించారు.బూరుగుపల్లి శేషారావు షరీఫ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మలేషియా నుంచి షరీఫ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చిన టీడీపీ ఎన్ఆర్ఐ విభాగానికి, మాజీ ఎమ్మెల్యే శేషారావుకు కుటుంబీకులు,గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



నల్లజర్లలో ఆందోళన చేస్తున్న పీఈటీలు

మేం ఆడించలేం!

- 18న ఆడుదాం - ఆంధ్రాపై పీఈటీల విముఖత
- సౌకర్యాలు కల్పించాలని నల్లజర్లలో ఆందోళన

నల్లజర్ల,జనవరి 12 : ఆడుదాం ఆంధ్రా అంటూ హడావుడి తప్ప.. క్షేత్రస్థాయిలో మాత్రం పీఈటీలు వెనుకంజ వేస్తున్నారు. కనీసం నిర్వహణ ఖర్చులకు నిధులివ్వకపోవడంతో లబోదిబోమంటున్నారు. క్రీడల నిర్వహణపై విముఖత చూపుతున్నారు. నల్లజర్ల మండలంలో ఘటనే అందుకు నిదర్శనం. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రాలో క్రీడాకారులు, పీఈటీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో మండల పరిషత్ అధికారులు విఫలమయ్యారని నల్లజర్ల మండల పీఈటీలో శుక్రవారం నల్లజర్ల హైస్కూల్‌లో నిరసన వ్యక్తం చేశారు. క్రీడాకారులకు తాగునీరు,నెట్, వాలీబాల్,ఇతర క్రీడా సామగ్రి పూర్తి స్థాయిలో అందించలేకపోతున్నారని వాపోయారు.పీఈటీలకు భోజన సదుపాయం సైతం ఎవరికి వారే తెచ్చుకోవాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు.మా అంతట మేం అన్నీ చేసుకుంటే మీరేం చేస్తారని ప్రశ్నించారు. ఏర్పాట్లు చేయకుండా ఆడుదాం ఆంధ్రా అంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు నిర్వహణ ఏర్పాట్లు పటిష్టంగా చేస్తేనే తాము 18వ తేదీ నుంచి క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. ఆందోళనలో పీఈటీల సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే.వి.వెంకట్రావు, పల్లి వెంకట అప్పారావు, పీఈటీలు డి.రాజారావు,టీ త్రిపుర స్వాతి,టి.రాంబాబు పాల్గొన్నారు.



డి.ముప్పవరంలో సిద్ధమైన బరి

బరి తెగించారు!

- గ్రామాల్లో సిద్ధమవుతున్న బరులు
- అనుమతులకు ఎదురుచూపులు
- డి.ముప్పవరంలో బరులకు ఏర్పాట్లు

నిడదవోలు, జనవరి 12 : సంక్రాంతి వస్తుందంటే కోడిపందేల నిర్వాహకులు బిజీబిజీ.. ఔనన్నా కాదన్నా నిర్వాహకులు బరితెగిస్తారు.మూడు రోజులు పండగ చేసుకుంటారు. అధికారపార్టీ నేతల ఆధ్వర్యంలో జరుగుతున్న కోడిపందేల బరులకు ప్రభుత్వ అధికారులు పూర్తిగా సహకారం అందించేస్తుంటారు. పైకి మాత్రం కోడిపందేలు వేసినా, చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినా చర్యలు తప్పవంటూ హెచ్చరికలు మాత్రమే జారీ చేస్తారు. ఎంత బలంగా హెచ్చరికలు చేస్తే అంత బరువుగా లబ్ధిని పొందుతారు. ఒకే గ్రామంలో అదీ ప్రధాన మార్గంలో మూడు బరులు సిద్ధమవుతున్నా అటువైపు చూసే అధికారులై కరు వయ్యారు. నిడదవోలు మండలం డి.ముప్పవరం నుంచి గోపవరం వెళ్ళే రోడ్డులో ప్రతీ ఏడాది కోడిపందేల బరులు వేస్తారు. ప్రతీ ఏడాది లాగే ఈ ఏడాది మూడు బరులు అధికారపార్టీకి చెందిన నేతల కనుసన్నల్లో సిద్ధమవుతున్నాయి. అయితే అటువైపు చూసిన అధికారులే లేరు. పోనీ అదేదో మారుమూల ప్రాంతం కాదు. కొబ్బరితోటల్లో మట్టిని చదును చేసి బరులు సిద్ధం చేశారు. ఇక పైనుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే అప్పటికప్పుడు బరుల చుట్టూ ఫెన్సింగ్, లైటింగ్, టెంట్లు యుద్ధప్రాతిపదిక సిద్ధమవుతాయి. ఇప్పటికే పోలీస్ రెవెన్యూ శాఖాధికారులు గ్రామాల్లో సభలు పెట్టి తూతూమంత్రంగా హెచ్చరికలు జారీచేయడమే తప్ప చిత్తశుద్ధితో కోడిపందేలు, గుండాట, కోతాట అరికట్టేందుకు చర్యలు చేపట్టడం లేదనడానికి ఈ సంఘటనే నిదర్శనంగా ఉంది.ఇప్పటికైనా డి.ముప్పవరం బరులపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి కోడిపందేలు నిరోధించాలని ప్రజలు కోరు తున్నారు.

పోతవరంలో బరి ధ్వంసం

నల్లజర్ల,జనవరి 12 : నల్లజర్ల మండలం పోతవరంలో కోడి పందేల బరి ధ్వంసం చేసినట్టు సీఐ కె.దుర్గా ప్రసాద్ తెలిపారు. పోతీనీడుపాలెం,పోతవరం గ్రామాల్లో గతంలో కోడి పందేలు వేసే ప్రదేశాలను శుక్రవారం పరిశీలించారు.పోతవరంలో బరి ఏర్పాటు చేయడంతో ధ్వంసం చేశామన్నారు. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. కోడి కత్తులు కట్టే వారిని గుర్తిస్తున్నామని,బరులు వేసి వారిని అదుపులోకి తీసుకుని కోడి పందాలు జరగకుండా అడ్డుకుంటామన్నారు.ఆయన వెంట ఎస్ఐ టీవీ. సురేష్,తహసీల్దార్ కిషోర్‌కుమార్ ఉన్నారు.





అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మాధవీలత

త్వరలో సైన్స్ కేంద్రం ప్రారంభం : కలెక్టర్

రాజమహేంద్రవరం,జనవరి 12(ఆంధ్రజ్యోతి) : బొమ్మూరులో నిర్మించి సైన్స్ కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్టు జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు. సైన్స్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్టు అధికారి జేడీ రావు విశేషాలను ఆమెకు వివరించారు. సివిల్ పనులకు చెందిన అంచనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సైన్స్ సెంటర్ అధికారులు డ్రైనేజీ వ్యవస్థ, కాంపౌండ్ వాల్ సమస్యను కలెక్టర్‌కు వివరించారు.ఆమె వెంట ఫీల్డ్ ఆఫీసర్ పి.సత్యనారాయణ, హార్టికల్చరిస్టు సీఎస్.స్వామి, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎస్వీవీ.రెడ్డి, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామి నాయుడు, ఎస్ఈ పీఆర్ ఏటీవీ.ప్రసాద్, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్ డి.బాలశంకరావు, డీజీవో జె సత్యనారాయణ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పర్యావరణ సమతుల్యత పెంపునకు చర్యలు

ఉపాధి హామీ సిబ్బందితో సమావేశంలో డ్వామా పీడీ జగదాంబ



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ జగదాంబ

కొవ్వూరు, జనవరి 12: పర్యావరణ సమతుల్యత, సన్న, చిన్నకారు రైతుల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకే వివిధ రకాల ప్లాంటేషన్ పనులు గుర్తించాలని డ్వామా పీడీ పి.జగదాంబ అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డివిజన్‌లోని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లేబర్ బడ్జెట్ ప్రకారం పనులు గుర్తించి, పరిపాలన ఆమోదం పొందాలన్నారు. సీఎల్‌ఏఆర్‌టీ యాప్ ద్వారా కొత్త పనులు గుర్తించుట, భూగర్భ జలాలు పెంపొందించేందుకు చేపట్టవలసిన పనులపై అవగాహన కల్పించడంపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుశీల, కొవ్వూరు క్లస్టర్‌కు సంబంధించి 9 మండలాల కార్యాలయాల సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బంది, టీఏలు, సీవోలు పాల్గొన్నారు.

కొవ్వూరు ఆంధ్రా షుగర్స్‌లో భద్రతా వారోత్సవాలు

కొవ్వూరు, జనవరి 11: మనిషి జీవితంలో ఒక నిమిషం అనేది చాలా విలువైనదని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.స్వర్ణ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం కొవ్వూరు ఆంధ్రా షుగర్స్ కర్మాగారంలో భద్రతా వారోత్సవాలను ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సల్ఫర్ (గంధకం) ప్రమాదానికి గురైతే తీసుకోవలిసిన జాగ్రత్తలపై ఫ్యాక్టరీ సిబ్బందికి మాక్ డ్రిల్ నిర్వహించారు. శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో 16 నుంచి 38 ఏళ్ల వయస్సు వారు అధికంగా మృత్యువాత పడుతున్నారన్నారు. డ్రైవర్లకు రోడ్డు, రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. పాముకాటుకు గురైన వారిని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందిస్తే ప్రాణాన్ని కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ఎండీ జమీర్, సేఫ్టీ ఇన్‌చార్జి కేవీవీ సత్యనారాయణమూర్తి, సీహెచ్‌ఎస్ మహర్షి, ఆటోమొబైల్ ఇంజనీరు డి.సూర్యప్రకాశరావు, జీవీఎన్ సంజీవరావు, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉండ్రాజవరం ఎస్‌ఐగా అప్పలరాజు

ఉండ్రాజవరం, జనవరి 12: ఉండ్రాజవరం ఎస్‌ఐగా వి.అప్పలరాజు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన రాజమహేంద్రవరం త్రీటౌన్ నుంచి బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ కె.రామారావు అనపర్తి మండలానికి బదిలీపై వెళ్లారు.

పోడుభూములపై భూస్వాముల కన్ను

ఆందోళనలో సగ్గొండ గ్రామస్థులు.. తహశీల్దార్‌కు వినతి



న్యాయం చేయాలంటూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పట్టాదారులు

గోపాలపురం, జనవరి 12: పోడుభూములపై భూస్వాముల కన్నుపడిందని సగ్గొండ గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అందులో భాగంగా 75మంది పట్టాదారులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రవీంద్రనాథ్‌కు శుక్రవారం అందజేశారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ సగ్గొండ గ్రామ రెవిన్యూ పరిధిలో 140సర్వే నెంబర్‌లో 75మంది పట్టాదారులు, 25 ఏళ్ల నుంచి సాగుచేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నామన్నారు. ఈ భూములపై కన్నేసిన కొందరూ భూస్వాములు ఆక్రమించుకునేందుకు పట్టాదారులను బెదిరిస్తున్నట్టు తెలిపారు. 2001-02 నుంచి పాస్‌పుస్తకాలు ఉన్నాయని, 2004-05లో కొందరూ భూస్వాములు పట్టాదారులకు సంబంధించిన 40 ఎకరాల భూమిని వారి బంధువులకు బినామీ పట్టాల ద్వారా అమ్ముకున్నారన్నారు. భూముల రీసర్వే జరగకుండా అడ్డుపడుతున్నారన్నారు. అధికారులు కూడా బినామీలకు కొమ్ముకాస్తున్నారని పట్టాదారులు ఆరోపించారు. దీనిపై తహశీల్దార్‌ను వివరణ కోరగా సర్వే నెంబర్ 145 భూమికి సంబంధించి వివాదం కలెక్టర్ పరిధిలో ఉందని ఆ సర్వే నెంబర్‌ను అవుట్‌లైన్ సర్వేస్ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పిట్టా రామారావు, బీజేపీ నాయకుడు వెంకటరమణ, పట్టాదారులు రేలంగి వెంకటేశ్వరరావు, నక్కా అచ్చమ్మ, రమాదేవి, కటకం వెంకటేశ్వరరావు, ఆవిడి పోచమ్మ, వెంకటలక్ష్మి, సూర్యకుమారి, అచ్చాయమ్మ, దుర్గమ్మ, నాగమణి, మల్లిపూడి బేబి, పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో 'ఆరోగ్య సురక్ష'



వేగేశ్వరపురంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రామారావు

తాళ్లపూడి, జనవరి 12: మండలంలో వేగేశ్వరపురంలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని సచివాలయం-2 పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సర్పంచ్ కేపీ రామారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య, డాక్టర్లు నిశాంత్, హారిక గుప్త, కార్యదర్శి శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది సేవలందించారు.



దేవరపల్లి: దేవరపల్లిలో జరిగిన కార్యక్రమంలో పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేవీ కే దుర్గారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, వైద్యాధికారి సాంబశివరావు, కార్యదర్శి రవికిషోర్, కడిమి రాజు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వాదాలకుంట జడ్పీ హైస్కూల్ 2007-08 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

గోపాలపురం, జనవరి 12: మండలంలోని వాదాలకుంట జడ్పీ హైస్కూల్లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం శుక్రవారం జరిగింది. 2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకుని ఆనాటి సంగతులను, అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో హేమలత, సింధూ, మోహిని, కల్యాణి, అవినాష్, దేవేంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

కొవ్వూరు, జనవరి 12: ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ జి.సతీష్ తెలిపారు. మండలంలోని పెనకనమెట్ట గ్రామ శివారులో శుక్రవారం పేకాడుతున్నారనే సమాచారం రావడంతో సిబ్బందితో దాడిచేసి ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2150 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బాడీబిల్డింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 12: ఆకివీడులో ఈనెల 14న జరిగే రాష్ట్ర బాడీబిల్డింగ్ పోటీలకు జిల్లా నుంచి 8 మంది సభ్యులతో కూడిన జట్టు పాల్గొననుందని బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి వీరభద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు.

బాపిరాజుకు టీడీపీలో ప్రాధాన్యమివ్వాలి



మంగళగిరిలో ప్రోగ్రామ్ కమిటీ కార్యదర్శి స్వాతిని కలిసిన నాయకులు

» మంగళగిరిలో జడ్పీ మాజీ చైర్మన్ వర్గం వినతులు

నల్లజర్ల, జనవరి 12: విద్యార్థి దశ నుంచి ముళ్ళపూడి బాపిరాజు టీడీపీకి అనేక సేవలు చేశారని, జడ్పీ చైర్మన్‌గా పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించి, ఉత్తమ జిల్లా పరిషత్‌గా జాతీయ అవార్డు పొందారని, ఆయనకు పార్టీలో తగిన ప్రాధాన్యం కల్పించాలని పలువురు పార్టీ నాయకులు కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి కార్ల ర్యాలీతో పార్టీ అధినేత చంద్రబాబును కలవడానికి శుక్రవారం మంగళగిరి వెళ్లారు. చంద్రబాబు అందుబాటులో లేకపోవడంతో ప్రోగ్రామ్ కమిటీ కార్యదర్శి స్వాతికి చంద్రబాబుకు అందించాలని ఈ మేరకు రెండు వినతి పత్రాలు అందించారు. అలాగే గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు సీనియర్ కేడర్‌ను పట్టించుకోవడం లేదని, ఎమ్మెల్యే టికెట్ మద్దిపాటికి కాకుండా ఎవరికైనా ఇస్తేనే తామంతా కలిసికట్టుగా పనిచేసి గెలిపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, రావూరి వెంకటరమణ, అల్లాడ రాజారావు, వల్లూరి సత్తిపండు, గుదే సుబ్బారావు, ఏలేటీ సత్యనారాయణ, వేణు, గుదే శ్రీను, కోరారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నల్లజర్ల నుంచి మంగళగిరి వెళ్తున్న టీడీపీ నాయకులు

జగనన్న కాలనీల్లో ఇళ్ల పైనుంచి విద్యుత్ తీగలు

» నిలిచిపోయిన బేస్మెంట్, శ్లాబ్ లెవెల్ నిర్మాణాలు
» సమస్యలు పరిష్కరించాలంటూ ఎంపీటీసీలు, సర్పంచ్‌ల వేడుకోలు
» దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, జనవరి 12: జగనన్న కాలనీలో గ్రామాల్లోనూ విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విద్యుత్ శాఖ అధికారులు, ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. దేవరపల్లిలో శుక్రవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరిగింది. దేవరపల్లి, త్యాజంపూడి, చిన్నాయిగూడెం, సంగాయిగూడెం గ్రామాల్లో జగనన్న కాలనీల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని త్యాజంపూడి ఎంపీటీసీ పల్లి రాంబాబు, యాదవోలు సర్పంచ్ వరప్రసాద్ సభ దృష్టికి తీసుకొచ్చారు. త్యాజంపూడిలోని జగనన్న కాలనీల్లో బేస్మెంట్, స్లాబ్ లెవెల్ నిర్మాణాలు చేపట్టారని, అయితే విద్యుత్‌తీగలు కాలనీ మధ్యలో నుంచి వెళ్లడంతో నిర్మాణాలు ఆగిపోయాయని వాపోయారు. దీంతో వెంటనే విద్యుత్‌లైన్లు మార్చాలని దేవరపల్లి విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణారావును, యర్నగూడెం విద్యుత్ శాఖ ఏఈ సురేష్‌ను ఎంపీపీ ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఏవో కె.విజయ్ మాట్లాడుతూ ధాన్యాన్ని రూ.20 కోట్లతో కొనుగోలు చేశామని, 60శాతం ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. కొనుగోలు చేసిన సొమ్మును రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. ఆర్‌బీకే కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్నామని చెప్పారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు పాఠశాలల్లో మిడ్డే మీల్స్‌లో నాణ్యమైన ఆహారం అందించే విధంగా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాము, కుక్కకాటులకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచామని అన్నారు. త్వరలో ఎన్నికలు ఉన్నాయని ఎన్నికల కోడ్ రాక ముందే గ్రామాల్లో, పంచాయతీ పరిధిలోని అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణంరాజు, తహశీల్దార్ రామకృష్ణ, వైస్ ఎంపీపీ అరుణ, సుబ్బారావు, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

స్వామి వివేకానందతో యువతకు అనుబంధం

» అందుకే ఆయన పుట్టినరోజు యువతకు అంకితం
» వివేకానంద జయంతిలో 'నన్నయ' వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, జనవరి 12: స్వామి వివేకానందునికి యువతతో ఎంతో అనుబంధం ఉందని, అందుకే ఆయన పుట్టినరోజు యువతకు అంకితమైందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. స్వామివివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం నన్నయ వర్శిటీలో జరిగిన కార్యక్రమంలో వివేకానంద చిత్రపటానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. తన భావజాలంతో యువతకు స్ఫూర్తిగా నిలిచారని, మన దేశం తరపున అమెరికా వెళ్లి తన మాట తీరుతో అక్కడి ప్రజలందరితో శభాష్ అనిపించుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఈసీ సభ్యులు గంధం నారాయణరావు, ఆచార్య పి.సురేష్‌వర్మ, పి.విజయ నిర్మల, కె.నూకరత్నం, కోఆర్డినేటర్ ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.



నన్నయ వర్శిటీలో వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ

కొవ్వూరు: హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వూరు టోల్‌గేట్ సెంటర్, నందమూరు, ఆరికిరేవుల గ్రామాల్లో స్వామి వివేకానంద విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. స్వామి వివేకానంద పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనపర్తి గోపాలకృష్ణ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను నెరవేర్చడమంటే యువత ఆయన చూపిన బాటలో నడవడమేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు ఎం.రామచంద్రరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, ఎస్.రాఘవేంద్ర, వైకే శ్రీనివాస్, టీవీ ముత్యాలరావు, మద్దుల సత్యనారాయణ, నాళం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని ఊనగట్లలో వివేకానంద విగ్రహానికి బీజేపీ నాయకుడు పరిమి రాధాకృష్ణ నివాళులర్పించారు. ఆయన నేటి యువతకు ఆదర్శమే కాదు, స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో మద్దిపాటి సురేష్, తాళ్ళూరి వరప్రసాద్, మన్నే శ్రీను, కంచుమర్తి సుబ్బారావు, కరుటూరి జగన్, జుట్ట గణపతి పాల్గొన్నారు. స్థానిక శ్రీరాజరాజేశ్వరి విద్యాలయంలోను వివేకానంద జయంతిని నిర్వహించి విద్యార్థులకు ఆయన జీవిత చరిత్రను వివరించారు.





కొవ్వూరు, చాగల్లు మండలం ఊనగట్లలో వివేకానంద విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



చాగల్లులో సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు



నిడదవోలులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సంక్రాంతి సంబరాలు

చాగల్లు, జనవరి 12: సంక్రాంతి ముందస్తు సంబరాలను పలుచోట్ల శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చాగల్లులో శ్రీరాజరాజేశ్వరి విద్యాలయలో విద్యార్థులు రంగవల్లులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. సంక్రాంతి పాటలు పాడి కోలాట భజనలు చేశారు. హరిదాసులు పాటలు, గొబ్బి పాటలతోను సందడి చేశారు. కార్యక్రమాల్లో పాఠశాల డైరెక్టర్ వల్లిపల్లి వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పాటెమ్మపేటలోని శ్రీకోదండ రామాలయం ప్రాంగణంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిడదవోలు: నిడదవోలులోని మదన గోపాలస్వామి ఆలయం వద్ద వాసవి వనితాక్లబ్ ఆధ్వర్యంలో రంగవల్లులు, సాంప్రదాయ భామలు, పిండి వంటల పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు సింహాద్రి శిరీష మాట్లాడుతూ సంక్రాంతి తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వనితాక్లబ్ కార్యదర్శి గొల్లపూడి గాయత్రి, జవ్వాది శిరీష, జయవరపు లక్ష్మి, పెరుమాళ్ళ విజయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.



నల్లజర్ల: ప్రకాశరావుపాలెం వైజ్‌లో సంక్రాంతి సంబరాలు

కొవ్వూరు: కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా విద్యార్థినులు ముగ్గులు వేసి, రంగులద్దారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ అరవిందకుమార్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, సంప్రదాయ దుస్తులతో నృత్యాలు, హరిదాసులకు సత్కారాలు, గొబ్బెమ్మలు, భోగి మంటలు వేశారు. కళాశాల డైరెక్టర్ మూర్తి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయలను ప్రపంచ దేశాలకు తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.



కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే జైలుకే : ఎస్పీ

త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు, గుండాట, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే జైలు తప్పదని ఎస్పీ జగదీశ్ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగాంగా శుక్రవారం ఆయన మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, పరిసరాలు, హెల్ప్‌డెస్క్, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ స్థితిగతులు, కేసుల పరిస్థితి తదితర అంశాలను ఆయనకు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. దర్యాప్తులో ఉన్న కేసుల్లో సమగ్ర విచారణ చేసి గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా త్వరగా నేర నిరూపణ జరిగే విధంగా కృషి చేయాలన్నారు. పెండింగులోని కేసులను వేగంగా పరిష్కరించాలన్నారు. ఎన్‌డీపీఎస్, పోక్సో/అత్యాచారం తదితర తీవ్ర నేరాల కేసుల్లో దర్యాప్తు త్వరగా పూర్తిచేసి చార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. గంజాయి, సారాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌటీషీటర్లు, బ్లేడ్‌బ్యాచ్, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వాళ్లు, పాత నేరస్తులకు అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి వాళ్లలో మార్పు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. రాత్రివేళల్లో గస్తీ పెంచి చోరీలు జరగకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలపై విస్తృతంగా అవగాహనా సదస్సులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ముందస్తు సమాచారాన్ని సేకరించడం ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎస్పీ విజయ్‌పాల్‌ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు టీఎన్‌వీఎస్ శ్యాంసుందర్, వి.అప్పలరాజు, కె.రామకృష్ణ, ఆర్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

జూదాలకు వెళ్లి జీవితం పాడు చేసుకోవద్దు

సీఐ జగదీశ్వరరావు..పలుచోట్ల అవగాహన సదస్సులు

కొవ్వూరు, జనవరి 12: కోడి పందేలు, జూదాలకు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. ఆరికిరేవుల, వేములూరు, కుమారదేవం, ధర్మవరం, సీతంపేట గ్రామాల్లో శుక్రవారం కోడి పందేలు, గుండాట, పేకాట వంటి క్రీడలు నిషేధంపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. జూదక్రీడల్లో కేసున మోదైతే ఉద్యోగాలు, విదేశాలకు వెళ్లే సమయంలో ఆటంకాలు ఏర్పడవచ్చునన్నారు. తహశీల్దార్ నాగరాజునాయక్ మాట్లాడుతూ సంక్రాంతి ముసుగులో కోడి పందేలు, గుండాట, పేకాట నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ జి.సతీష్, సర్పంచ్ మట్టా శ్రీనివాసు పాల్గొన్నారు.

జూదక్రీడలు నిర్వహిస్తే ఉపేక్షించం: ఎస్‌ఐ

గోపాలపురం, జనవరి 12: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ యువత సంక్రాంతి ముసుగులో జూదక్రీడల జోలికి పోవద్దని, కోడిపందాలు, పేకాట, గుండాట నిర్వహిస్తే ఉపేక్షించబోమన్నారు. సాంప్రదాయ క్రీడలైన కబాడ్డీ, వాలిబాల్, తదితర క్రీడలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు పాల్గొన్నారు.

మొండి వైఖరి విడనాడాలి

హామీలు అమలు చేయాలి.. అంగన్‌వాడీల నిరసన దీక్ష



ఉండ్రాజవరంలో మెడకు ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కొవ్వూరు, జనవరి 12: ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించి, జీవితాల్లో వెలుగులు నింపాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ అన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన అంగన్వాడీల సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరింది. ప్రభుత్వం ఇకనైనా మొండి వైఖరిని విడనాడి సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు సుప్రీంకోర్టు తీర్పుమేరకు గ్రాట్యూటీ అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సీహెచ్ పుష్పావతి, సుబ్బలక్ష్మి, ఎ.నరసమాంబ, బి.పద్మజ, బి.వసంత, డి.అమరావతి, సీహెచ్.బ్రహ్మమ్మ, వి.శ్రీదేవి, చిన్న లక్ష్మి పాల్గొన్నారు



తాళ్లపూడి: మండలంలోని అంగన్‌వాడీలు తాళ్లపూడి లో దీక్షను కొనసాగించారు. అధికారంలోకి రాగానే తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చుస్తామని చెప్పిన వైఎస్ జగన్ తమకు అన్యాయం చేశారని, నెల రోజులుగా నిరవధిక దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోగా తిరిగి నోటీసు అందిస్తున్నారని వాపోయారు. డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు.

ఉండ్రాజవరం: మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో అంగన్వాడీలు నిరసన ఉదయం యేసుప్రభువుకు ప్రార్థనలు చేసిన అనంతరం ఐసీడీఎస్ పెరవలి ప్రాజెక్టు గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు ఆధ్వర్యంలో సామూహిక ఉరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్వాడీలు తమ మెడలకు ఉరితాడు తగిలించుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్.రంగనాయకమ్మ, వి.లక్ష్మి, కె.ప్రసన్నకుమారి, మహాలక్ష్మి, సీహెచ్ జ్యోతి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్ 1	గుంటూరుకారం
వై.స్ర్కీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	సైంధవ్
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	గుంటూరు కారం
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్